

పంచాయతీకో కార్యదర్శి



క్లస్టర్ల స్థానంలో గ్రేడ్ల విధానం - వర్గీకరణకు కమిటీ ఏర్పాటు

చిత్తూరుకలెక్టరేట్, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ వ్యవస్థలో అశాస్త్రీయమైన క్లస్టర్ విధానంతో పాలనలో వైఫల్యాలు ఎదురవుతున్నాయి. ఆదాయం ఆధారంగా తెచ్చిన క్లస్టర్ విధానంతో సిబ్బంది కేటాయింపులో హెచ్చుతగ్గులు ఏర్పడి గ్రామ పంచాయతీల్లో పనులు సకాలంలో పూర్తికావడం లేదు. ఈ సమస్యను గుర్తించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ క్లస్టర్ల విధానానికి స్వస్తిపలికి జనాభా ఆధారంగా గ్రేడ్ల విధానం తీసుకు రావాలని నిర్ణయించారు. గ్రేడ్లవారీగా ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శితో పాటు అవసరమైన సిబ్బందిని నియమించనున్నారు. ఈ మేరకు పంచాయతీ వ్యవస్థ వర్గీకరణకు ఇటీవల నలుగురు అధికారులతో కూడిన కమిటీని ప్రభుత్వం నియమించింది.

● ఎదురవుతున్న ఇబ్బందులు

2010వ సంవత్సరంలో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీల ఆదాయాన్ని పరిగణనలోకి తీసుకుని క్లస్టర్ విధానాన్ని అమల్లోకి తెచ్చింది. ఒక్కో క్లస్టర్‌లో మూడు నుంచి నాలుగు పంచాయతీలున్నాయి. కొన్నిచోట్ల ఎక్కువ ఆదాయం ఉన్న పంచాయతీల్లో జనాభా తక్కువగా, తక్కువ ఆదాయం ఉన్న చోట జనాభా ఎక్కువగా ఉండడంతో 15ఏళ్ళుగా ఇబ్బందులు ఎదురవుతూనే వున్నాయి.

● ఖాళీ కుర్చీ... పల్లెలకేదీ దిక్సూచి?

గత ఐదేళ్ళ వైసీపీ ప్రభుత్వ విధానాలు పల్లె పాలనకు తీవ్ర విఘాతంగా మారగా, కూటమి ప్రభుత్వం ఇప్పుడిప్పుడే దిద్దుబాటు చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలోనే ఖాళీల సమస్య తెరపైకి వచ్చింది. చిత్తూరు జిల్లాలో గ్రేడ్-1, 2, 3, 4, 5లలో 540 మంది పంచాయతీ కార్యదర్శులు పనిచేస్తున్నారు. 696 పంచాయతీల్లో 156 పంచాయతీ సెక్రటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీల్లో ఒక్కో కార్యదర్శికి 2-3 గ్రామ పంచాయతీలకు ఇన్‌చార్జులుగా బాధ్యతలు అప్పగించినా, వారు పూర్తిస్థాయిలో దృష్టి సారించకపోవడంతో ఆశించిన ఫలితం ఉండడం లేదు.

మార్పులు ఇలా...

చిత్తూరు జిల్లాలోని 31మండలాల్లో 696పంచాయతీలున్నాయి. వైసీపీ హయాంలో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చినా క్లస్టర్ల విధానంలో మార్పులు చేయలేదు. జనాభా ప్రాతిపదికన పంచాయతీలకు గ్రేడింగులు ఇచ్చి తగినంత సిబ్బందిని ఇచ్చి, నిధులు కేటాయిస్తే వ్యవస్థ గాడిన పడుతుందని కూటమి ప్రభుత్వం భావిస్తోంది. గ్రేడ్లు కేటాయించాక కార్యదర్శులను నియమించే అవకాశం ఉంది. ఆదాయం, జనాభా ప్రాతిపదికన కలెక్టర్లు ఇచ్చే నివేదికను నిపుణుల కమిటీ పరిశీలించిన తర్వాత గ్రేడ్ల విభజనకు ప్రభుత్వానికి సిఫార్సు చేయనున్నారు. 2500 మంది జనాభాకు 'ఏ' కేటగిరి కింద ఆరుగురు, 2500 నుంచి 3500 జనాభాను 'బి' కేటగిరి కింద గుర్తించి ఏడుగురు, 3500కు మించి జనాభా కలిగిన గ్రామ పంచాయతీలను 'సి' కేటగిరి కింద గుర్తించి ఎనిమిదిమంది సచివాలయ ఉద్యోగులను నియమించాలని ప్రభుత్వం జీవో నెం.1లో సూచనలు జారీచేసింది. ఈ మేరకు రేషనలైజేషన్ చేయాలని ప్రభుత్వం ఆ జీవోలో పేర్కొంది. కాగా జనాభాను గుర్తించడంలో అధికారులు సతమతమవుతున్నారు. 2011తర్వాత నుంచి ఇప్పటివరకూ అధికారపూర్వకంగా జనాభా లెక్కలు తీయకపోవడం వల్ల జనాభా లెక్కలుగా వేటిని పరిగణనలోకి తీసుకోవాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఉన్నతాధికారుల దృష్టికి....

జిల్లాలో కొన్ని ఖాళీలున్న మాట వాస్తవమే. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లాం. కార్యదర్శుల పోస్టుల విషయంలో త్వరలో రాష్ట్రప్రభుత్వం నిర్ణయం తీసుకోనుంది. ప్రస్తుతానికి ఎక్కడా పాలనలో ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

- కె. సుధాకర రావు, డీపీవో, చిత్తూరు

గీత కార్మికులకు మద్యం దుకాణాల కేటాయింపు

● పెండింగ్‌లో 'పెద్దపంజాణి' దుకాణం



లాటరీ ద్వారా మద్యం దుకాణాలు కేటాయిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు సిటీ, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం జిల్లాలో కల్లుగీత కార్మికులకు కేటాయించిన మద్యం దుకాణాలను కలెక్టర్ సుమిత్ కుమార్ లాటరీ ద్వారా ఎంపిక చేశారు. సోమవారం కలెక్టరేట్‌లోని డీఆర్‌డీఏ మీటింగ్ హాల్‌లో కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు లాటరీ ద్వారా పారదర్శకంగా దుకాణాలను కేటాయించారు. 10 మద్యం దుకాణాలకు 79 దరఖాస్తులు వచ్చాయి. పెద్దపంజాణి మండలానికి కేటాయించిన మద్యం దుకాణానికి ఆన్‌లైన్‌లో ఒక్క దరఖాస్తు మాత్రమే వచ్చింది. దీనికి సంబంధించి కుల ధ్రువీకరణ పత్రంలో సబ్ క్యాస్ట్ నమోదు చేయని కారణంగా కలెక్టర్ పెండింగ్‌లో పెట్టారు. సదరు దరఖాస్తుదారుడి వివరాలు క్షేత్రస్థాయిలో విచారించి ధ్రువీకరించాలని పెద్దపంజాణి తహసీల్దార్‌ను ఆదేశించారు.

మద్యం దుకాణాలను దక్కించుకున్న వారిలా..

మద్యం దుకాణాలను దక్కించుకున్న వారిలో.. చిత్తూరు అర్బన్ - నాగరాజ, నగరి- దిలీప్, పలమనేరు - మదన్‌మోహన్, పుంగనూరు- దేవ, చిత్తూరు రూరల్ - జయశంకర్, కుప్పం - కన్నయ్య, పాలసముద్రం - నీల అలేఖ్య, వి.కోట - మురుగప్ప, వెదురుకుప్పం - వంశీకృష్ణ ఉన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ డీసీ విజయ్ శేఖర్, ఈఎస్ శ్రీనివాస్, ఏఈఎస్ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపు ఇచ్చేయాలని బెదిరిస్తున్నారు

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం మద్యం షాపును వెదురుకుప్పం మండలం పాతగుంటకు చెందిన నీల అలేఖ్య దక్కించుకున్న విషయం తెలిసిందే. దరఖాస్తు సమయంలో రమేష్‌రెడ్డి, మునికృష్ణారెడ్డి వద్ద తాను కొద్ది మొత్తం అప్పు తీసుకున్నారు. ఈ క్రమంలో షాపును తమకు ఇచ్చేయాలని వీరిద్దరూ బెదిరిస్తున్నారంటూ ఆమె సోమవారం రాత్రి చిత్తూరు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తీసుకున్న డబ్బును తిరిగి ఇచ్చేస్తానని చెబుతున్నా.. ఒప్పుకోవడం లేదని అసభ్యంగా మాట్లాడుతున్నారని ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు విచారిస్తున్నారు.

కూటమి అధికారంలోనూ

పెద్దిరెడ్డికే అనుకూలంగా అధికారులు

టీడీపీ కేంద్ర కార్యాలయంలో సదుంవాసుల ఫిర్యాదు



టీడీపీ సీనియర్ నాయకుడు కంభంపాటి రామ్మోహనరావుకు ఫిర్యాదు చేస్తున్న సదుం మండలవాసులు

చిత్తూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా చిత్తూరు జిల్లాలో అధికారులు ఇంకా వైసీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి అనుకూలంగా పనిచేస్తున్నారని సదుం మండలానికి చెందిన పలువురు వాపోయారు.గుంటూరు జిల్లా మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌కు సోమవారం సదుం మండలానికి చెందిన పెద్దిరెడ్డి బాధితులు పలువురు తరలివచ్చారు. తమ భూముల్ని కబ్జా చేశారని ఒకరు.. కుటుంబం మొత్తం మీద అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపించారని మరొకరు..తహసీల్దార్, ఎస్‌ఐ తమ సమస్యల్ని పట్టించుకుని న్యాయం చేయడం లేదని ఇంకొకరు.. ఫిర్యాదులు చేశారు. టీడీపీ నాయకులు కంభంపాటి రామ్మోహన రావు, బుచ్చిరామ్‌ప్రసాద్ బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు.సదుం మండలం బూరగమంద, గాదేవారిపల్లె, గంటావారిపల్లె, కొర్లకుంటవారిపల్లె తదితర గ్రామాల నుంచి బాధితులు తమకు జరిగిన నష్టం గురించి ఆధారాలతో ఫిర్యాదులు చేశారు. బూరగమందలో పూర్వీకుల నుంచి వచ్చిన భూమిని కబ్జా చేసి, అందులోని మామిడి చెట్లను లోడేశారని, ఇప్పుడున్న రెవెన్యూ అధికారులు పెద్దిరెడ్డికి అనుకూలంగా పనిచేస్తున్నారని, డిగ్రీ చదివే తన కుమారుడిపై హత్యాయత్నం కేసు పెట్టి రెండు నెలలు జైల్లో పెట్టారని ఓ మహిళ ఆవేదన వ్యక్తం చేశారు. తమకున్న మూడెకరాల భూమిని ప్రాజెక్టు కోసం తీసుకుని పరిహారం ఇవ్వలేదని యశోదమ్మ అనే మహిళ ఫిర్యాదు చేసింది. ఇప్పటికీ లోకల్‌గా అధికారులు పెద్దిరెడ్డి కనుసన్నల్లోనే పనిచేస్తున్నారని వెంకటస్వామి చెప్పుకొచ్చారు. ఎన్నికల సమయంలో 14 మందిని కిడ్నాప్ చేసిన వైసీపీ నాయకులు ఇప్పుడు కూడా తమను బెదిరిస్తున్నా స్థానిక ఎస్‌ఐ పట్టించుకోవడం లేదని ఎస్టీ నేత ఒకరు ఫిర్యాదు చేశారు.తమ ఇంటి ముందున్న ఖాళీ స్థలాన్ని ఆక్రమించుకుని మెష్ వేసేసి ప్రశ్నించిన తన కుటుంబ సభ్యులందరిపై అక్రమ కేసులు పెట్టారని మరో వ్యక్తి ఆవేదన వ్యక్తం చేశారు.

టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు ప్రారంభం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): టెన్త్ ప్రీ ఫైనల్ పరీక్షలు సోమవారం నుంచి అన్ని యాజమాన్య పాఠశాలల్లో ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 517 ఉన్నత పాఠశాలల్లో 20,954 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటలకు వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నారు. సోమవారం తెలుగు పరీక్షను విద్యార్థులు రాయగా, 11న హిందీ, 12న ఇంగ్లీషు, 15న గణితం, 17న భౌతికశాస్త్రం, 18న జీవశాస్త్రం, 20న సాంఘికశాస్త్రం పరీక్షలు జరగనున్నాయి.

తొలిరోజు ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 57 మంది గైర్హాజరు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 28 సెంటర్లలో సోమవారం ఇంటర్మీడియట్ జనరల్ ప్రాక్టికల్స్ మొదలయ్యాయి. తొలి రోజున 2427 మంది విద్యార్థులకుగాను 2370 మంది హాజరవగా, 57 మంది గైర్హాజరైనట్లు డీవీఈవో సయ్యద్ మౌల తెలిపారు. ఉదయం 1352 మందికిగాను 1321 మంది హాజరవగా, 31 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం 1075 మందికి గాను 1049 మంది హాజరవగా, 26 మంది గైర్హాజరైనట్లు ఆయన తెలిపారు.

అర్జీదారుల కష్టం తెలిసి..

● సచివాలయ సిబ్బందిని నియమించిన కలెక్టర్



బాధితులకు ఉచితంగా అర్జీలను రాసిస్తున్న సచివాలయ సిబ్బంది

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పెన్షన్ కోసం ఒక అర్జీ రాసివ్వాలంటే రూ.20, భూ, ఇతర సమస్యలపై అయితే రూ.50 వరకు బాధితుల నుంచి వెండర్లు తీసుకుంటారు. కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్ జరిగే రోజులతోపాటు మిగిలిన రోజుల్లోనూ డబ్బులిచ్చి రాయించుకోవడం బాధితులకు తలకుమించిన భారంగా మారింది. దీనికితోడు గతవారం అర్జీలు రాసిచ్చే క్రమంలో డబ్బులు తీసుకోవడంలో వెండర్ల మధ్య ఏర్పడ్డ తగాదా కలెక్టర్ దృష్టికి వెళ్లింది. దీనిపై అసహనం వ్యక్తం చేసిన ఆయన ప్రతి సోమవారం అవసరమైన మేరకు సచివాలయ సిబ్బందిని అందుబాటులోకి ఉంచి, బాధితులకు ఉచితంగా అర్జీలు రాసివ్వాలని చెప్పారు. ఈ క్రమంలో సోమవారం పలువురు సచివాలయ సిబ్బంది బాధితులకు అర్జీలను రాసిచ్చారు.

ఆర్మీ జవాన్ ఇంట్లో

చోరీయత్నం

వెంటబడి తరిమిన మోతరంగనపల్లె గ్రామస్తులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : చోరీ చేయడానికి వచ్చిన దొంగలను గ్రామస్తులు అప్రమత్తమై తరుముకున్న వైనమిది.ఇన్‌చార్జి సీఐ శ్రీనివాసంతి కథనం మేరకు...గంగాధరనెల్లూరు మండలం మోతరంగనపల్లెకు ఆదివారం రాత్రి 12గంటల ప్రాంతంలో ఇద్దరు వ్యక్తులు కారులో వచ్చారు.ఆర్మీ జవాను గోపిరెడ్డి ఇంటి సమీపంలో కారును పార్కు చేసి ఇంట్లోకి చొరబడ్డారు.గమనించిన పక్కింటివాళ్ళు చుట్టుపక్కలవారికి ఫోన్‌ద్వారా సమాచారాన్ని చేరవేశారు.దీంతో వారంతా కర్రలు తీసుకుని గోపిరెడ్డి ఇంటి సమీపంలోకి వచ్చేలోపు అలికిడి పసిగట్టిన దొంగలు బయటకు వచ్చి కారును స్టార్ట్ చేశారు. వాహనానికి అడ్డుపడ్డ గ్రామస్తులను కూడా లెక్కచేయకుండా ముందుకెళ్లారు.అయితే గ్రామస్తులు కర్రలతో కారు అద్దాలను పగలగొట్టి లోపల ఇద్దరున్నట్లు గుర్తించారు.గోపిరెడ్డి ఇంట్లో ఆయన తల్లి మాత్రమే ఉంటారని , ఆమె కూడా ఊరికి వెళ్ళిన సమయంలో ఇదంతా జరిగినట్లు గ్రామస్తులు చెప్పారు.గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న సీఐ శ్రీనివాసంతి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు కనుక్కున్నారు. గ్రామస్తులంతా ధైర్యంగా వారిని ఎదుర్కోవడం పట్ల అభినందించారు.

పాఠశాలల్లో పరీక్షా పే చర్చా వీక్షణం



గిరింపేట మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పీఎం మోదీ ప్రసంగాన్ని విద్యార్థులు

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి డిల్లీ నుంచి నిర్వహించిన ప్రత్యక్ష ప్రసారాన్ని సోమవారం జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులు వీక్షించారు. విద్యార్థుల్లో పరీక్షలపై భయం పోగొట్టేందుకు ప్రధాని మోదీ ఢిల్లీలో ఉదయం 10 గంటల నుంచి 9వ తరగతి విద్యార్థులతో పరీక్షా పే చర్చా కార్యక్రమం నిర్వహించారు. డీడీ నేషనల్, డీడీ న్యూస్, డీడీ ఇండియా, రేడియో చానళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారమైంది. ఉన్నత పాఠశాలల్లో ఆరు నుంచి టెన్త్ విద్యార్థులు టీవీల ద్వారా వీక్షించారు. ప్రధాని.. విద్యార్థులతో చేసిన సంభాషణలను, వారిచ్చిన సమాధానాలను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, టీచర్లు వివరించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలోని 380 ప్రభుత్వ, 142 ప్రైవేటు కలిపి మొత్తం 522 పాఠశాలల్లో వీక్షించారు. 59,601 మంది ప్రత్యక్షంగా చూశారు. వీరిలో 53,750 మంది విద్యార్థులు, 3,154 మంది ఉపాధ్యాయులు, 2,697 మంది విద్యార్థుల తల్లిదండ్రులున్నారు.

చంద్రబాబు అనుభవంతోనే రాష్ట్రం ముందుకు

- మంత్రి నారాయణ



తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అతలాకుతలమైందని, సీఎం చంద్రబాబు తనకున్న అపార అనుభవంతో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళుతున్నారని మంత్రి నారాయణ అన్నారు. తిరుమల శ్రీవారిని సోమవారం ఉదయం దర్శించుకున్న ఆయన ఆలయం ముందు మీడియాతో మాట్లాడారు. త్వరలో రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితులన్నీ మెరుగుపడి ప్రజలు అన్ని విధాల బాగుండాలని శ్రీవారిని కోరుకున్నట్టు చెప్పారు.

తిరుమలలో గదుల చెకౌట్ కేంద్రం

తిరుమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులకు గదుల నిరీక్షణ సమయాన్ని తగ్గించేందుకు టీటీడీ కసరత్తు చేస్తోంది. తిరుమలలో సిఫార్సు లేఖలపై ఎంబీసీ34, టీబీ కౌంటర్లలో, వీఐపీలకు పద్మావతి కౌంటర్లలో గదులు కేటాయిస్తారు. అయితే గత కొంతకాలంగా పద్మావతి, ఎంబీసీ కౌంటర్ల వద్ద సిఫార్సు లేఖలు ఉన్నప్పటికీ గంటల తరబడి క్యూలైన్లలో నిరీక్షించాల్సి వస్తోంది. శ్రీవారి దర్శనానికంటే గదులు పొందేందుకే అధిక సమయం పడుతోంది. దీనిపై టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీఈవో ఆర్1 భాస్కర్ ప్రత్యేక దృష్టిసారించారు. ఇందులో భాగంగా ఉద్యోగుల సిఫార్సుల కోసం ఎంబీసీ34కు సమీపంలో మరొక గదులు కేటాయింపు కౌంటర్‌ను ఇటీవల ప్రారంభించారు. పద్మావతి వద్ద గదులు ఖాళీ చేసేవారు కూడా క్యూలైన్ ద్వారానే వెళ్లాల్సివస్తోందని గుర్తించి పక్కనే ప్రత్యేకంగా చెకౌట్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నారు.. త్వరలోనే ఈకౌంటర్ అందుబాటులోకి రానుంది.



పద్మావతి కార్యాలయం పక్కనే ఏర్పాటు చేస్తున్న చెకౌట్ కేంద్రం

సర్వదర్శనానికి 16 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లలో సర్వదర్శనం భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం నాటి హుండీ ఆదాయం: రూ.3.67 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,536

తలనీలాలు సమర్పించినవారు: 25,890



ప్రతి అర్జీకీ పరిష్కారం చూపండి

● కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 249 వినతులు



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జేసీ శుభం బన్సల్

తిరుపతి(కలెక్టరేట్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్ఎస్ (ప్రజా సమస్యల పరిష్కార వేదిక)లో ప్రజలు ఇచ్చే ప్రతి అర్జీకీ పరిష్కారం చూపాలని జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 249 అర్జీలు వచ్చాయి. అందులో భూ సమస్యలపైనే 155 ఉండడం గమనార్హం. డీఆర్వో నరసింహులు, ఎస్‌డీసీ దేవేంద్రరెడ్డి, రోష్మాండ్, శివశంకర్‌నాయక్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు.

వెటర్నరీ వర్సిటీ విద్యార్థుల ఆందోళన



వెటర్నరీ విద్యార్థుల ధర్నా

స్టైపండ్ పెంచాలని, తమ సమస్యలు పరిష్కరించాలని శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం 8 రోజులుగా సమ్మె చేస్తున్న విద్యార్థులు.. సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. వైద్య విద్యకు సమానమైన వెటర్నరీ విద్యను వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విలీనం చేయాలనే నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. కలెక్టరేట్ నుంచి భారీ ర్యాలీగా వెటర్నరీ యూనివర్శిటీకి వెళ్లారు. యశ్వంత్, లీలాప్రసాద్, నాగరాజు, ఉషా మనోహర్, పవన్, నిరంజన్, మనోజ్, గుణ, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

మా పొలాలకు 'గంగ'ను ఇవ్వండి

'బాలయ్యపల్లి మండలం గిరిజన కాలనీకి చెందిన.. ప్రభుత్వం ఇచ్చిన భూముల్లో నిమ్మచెట్లు సాగు చేశాం. దీనికి 2009లో ఐటీడీఏ మూడు బోర్లు వేయగా.. నీళ్లు పడలేదు. మేమూ సొంతంగా బోర్లు వేసినా.. నీళ్లు సరిపోవడం లేదు. సుమారు 30 ఎకరాల్లో నిమ్మచెట్లు, ఇతర పంటలు ఎండిపోతున్నాయి. మా పొలాలకు కొంత దూరంలో తెలుగుగంగ కాలువ ఉంది. దీని నుంచి నీటిని మాకు ఇవ్వాలి' అని రైతులు కోరారు.



బాలాయపల్లి రైతులు

ఎస్టీ కార్పొరేషన్ రుణం మంజూరు చేయించండి



రోడ్డు ప్రమాదంలో రెండు కాళ్లు పోయాయి. పింఛను అయితే వస్తోంది. ముగ్గురు పిల్లలు, కుటుంబ పోషణ కష్టంగా ఉంది. ఎస్టీ కార్పొరేషన్‌లో రుణం ఇప్పిస్తే చిన్న కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తాను. కలెక్టరేట్ చుట్టూ తిరుగుతున్నా అధికారులు దయ చూపడం లేదు. మీరైనా కరుణించండి.

- వెంకటేశ్వరరావు, ఎంపేడు, శ్రీకాళహస్తి మండలం

పింఛను కోసం ఏడాదిగా తిరుగుతున్నా..

పింఛను కోసం కలెక్టరేట్ చుట్టూ సంవత్సరం నుంచి తిరుగుతూనే ఉన్నాను. ఎవరూ పట్టించుకోవడంలేదు. సచివాలయ సిబ్బందిని అడిగితే సరిగా సమాధానం చెప్పడం లేదు. మీరైనా స్పందించండి.

- చిరంజీవి, కొండకిందపల్లి, పదిపుట్లబైలు



తిరుపతిలో శాయ్ డీడీ పర్యటన

● మైదానాలు, భవనాల పరిశీలన



ఎస్వీయూ డార్మెటరీలో వంటశాలను పరిశీలిస్తున్న శాయ్ అధికారులు

తిరుపతి(క్రీడలు), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా (శాయ్) డిప్యూటీ డైరెక్టర్ నవీన్‌కుమార్ సోమవారం తిరుపతిలో పర్యటించారు. కర్నూలు, ఏలూరు, వైజాగ్, యానాంలో ఉన్నట్లుగా తిరుపతిలోనూ రాష్ట్రస్థాయి ఖేలో ఇండియా రెసిడెన్షియల్ స్పోర్ట్స్ ట్రైనింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలన్నది సీఎం చంద్రబాబు ఆలోచన. ఈ మేరకు గతేడాది డిసెంబరులో శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రతిపాదనలు తయారు చేసుకొని కేంద్ర క్రీడాశాఖా మంత్రి మన్సుక్ ఎస్.మాండవ్యను కలిశారు. ఆయన సూచన మేరకు శాయ్ డిప్యూటీ డైరెక్టర్(బెంగళూరుశాఖ)నవీన్‌కుమార్ సోమవారం ఉదయం శ్రీనివాస క్రీడా సముదాయానికి చేరుకొన్నారు. డీఎస్‌డీవో సయ్యద్‌సాహెబ్ తదితరులతో సమావేశమయ్యారు. జిల్లాలోని మైదానాలు, క్రీడా సదుపాయాలు, క్రీడల గురించి తెలుసుకున్నారు. ఎస్వీయూలోని డార్మెటరీ, ఫ్యాకల్టీక్వార్టర్స్, ఎమ్మెల్సీ భవనం, తారకరామ మైదానం, శ్రీనివాస క్రీడా సముదాయంలోని ఇండోర్ స్టేడియం, మల్టీపర్పస్‌హాల్‌ను పరిశీలించారు. ప్రతి భవనాన్ని తన సెల్‌ఫోన్‌లో వీడియో, ఫొటోలు తీసుకుంటూ సాధ్యాసాధ్యాలను పరిశీలించారు. తాను తనిఖీ చేసిన భవనాల స్థితిగతులపై నివేదిక తయారుచేసి శాయ్ ప్రధాన కార్యాలయానికి అందిస్తానని నవీన్‌కుమార్ చెప్పారు. ఇప్పటికే శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ఖేలోఇండియా మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియం, ఏర్పేడు వద్ద ఐసర్‌లో అథ్లెటిక్‌ట్రాక్ ఏర్పాటుకు నిధులు మంజూరుచేశామన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాజెక్టులకు అనుమతులిస్తామన్నారు.

ఆన్‌లైన్ చీటింగ్ కేసుల్లో లక్ష్మీరెడ్డి అరెస్టు

● అదుపులోకి తీసుకున్న రాజస్థాన్ పోలీసులు



తిరుపతిలో లక్ష్మీరెడ్డిని అదుపులోకి తీసుకున్న జైపూర్ పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ మోసం చేశాడంటూ ఆరోపణలు చేసిన తిరుపతి ఎంఆర్‌పల్లెకి చెందిన లక్ష్మీరెడ్డిని సోమవారం రాజస్థాన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆన్‌లైన్ చీటింగ్ కేసుల్లో వివిధ రాష్ట్రాల్లో ఈమెపై కేసులు నమోదైనట్లు తెలుస్తోంది. ఆమె కోసం కొన్ని నెలలుగా గాలిస్తున్న జైపూర్ పోలీసులు.. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ప్రెస్‌మీట్ తర్వాత లక్ష్మీరెడ్డిని అదుపులోకి తీసుకున్నారు. 2021లో జైపూర్, చాంద్వాజీ పోలీసు స్టేషన్లలో లక్ష్మీరెడ్డితో పాటు అరుణ్‌రెడ్డి, మహ్మద్ జాహిద్‌ఖాన్‌పై చీటింగ్ కేసు నమోదైందని తిరుపతి పోలీసులు చెప్పారు. అదుపులోకి తీసుకున్న లక్ష్మీరెడ్డిని ఎస్వీ యూనివర్సిటీ పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ్నుంచి వైద్య పరీక్షలు నిమిత్తం రుయాస్పత్రికి తరలించారు. వైద్య పరీక్షలు ముగిసిన వెంటనే తిరుపతిలోని అదనపు జ్యుడిషియల్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరిచారు. ఆ తర్వాత ఆమెను జైపూర్‌కు తీసుకెళ్లనున్నారని ఎస్వీయూ స్టేషన్ సీఐ రామయ్య చెప్పారు.

వివిధ సెక్షన్ల కింద కేసు

లక్ష్మీరెడ్డిపై సెక్షన్ 419, 420, 66సీ, 66డీ, 120-బి, 406 సెక్షన్ల కింద కేసు నమోదైనట్లు సమాచారం. ఈ కేసులో అరుణ్‌రెడ్డి, మహ్మద్ జాహిద్‌ను ఇప్పటికే పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో వున్న లక్ష్మీరెడ్డి కోసం పోలీసులు కొన్ని సంవత్సరాలుగా వెతుకుతున్నారని తెలిసింది. ఈ క్రమంలో మూడు రోజులుగా కిరణ్‌రాయల్ వ్యవహారంలో మీడియాలో కనిపించడంతో జైపూర్ పోలీసులు తిరుపతికి వచ్చారు. అరెస్టుకు ముందు లక్ష్మీరెడ్డి జిల్లా ఎస్పీ హర్షవర్ధన రాజును కలసి తనకు న్యాయం చేయాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చారు. అనంతరం తిరుపతి ప్రెస్‌క్లబ్‌కు చేరుకుని మీడియా సమావేశంలో కిరణ్ రాయల్‌పై ఆరోపణలు చేశారు.

కిరణ్ మాటలకు మోసపోయా

- లక్ష్మీరెడ్డి ఆరోపణ

తిరుపతి(జీవకోన), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జనసేన నేత కిరణ్‌రాయల్ మాయమాటలు నమ్మి మోసపోయానని బాధితురాలు లక్ష్మీరెడ్డి ఆరోపించారు. సోమవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడుతూ కిరణ్ పరిచయం అయినప్పటి నుంచి అతడికి అన్నీతానై ఆర్థికంగా సహాయ సహకారాలు అందించానని చెప్పారు. తనవద్ద నుంచి రూ.1.2 కోట్లను తీసుకున్నాడని, ఆ మొత్తం రాబట్టుకోవడానికే పోరాడుతున్నానన్నారు. సామాజిక మాధ్యమాల ద్వారా తన బతుకును హేళన చేసే విధంగా కిరణ్‌రాయల్ ట్రోల్ చేయిస్తున్నాడని ఆరోపించారు.

ఆమె పెద్ద చీటర్ అని అప్పుడే చెప్పా

● జైపూర్ పోలీసుల అరెస్టుతో రుజువైందన్న కిరణ్



తిరుపతి, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): 'నాపై అసత్యపు ఆరోపణలు చేస్తున్న లక్ష్మి పెద్ద చీటర్ అని తొలిరోజే చెప్పా. ఎవరూ నమ్మలేదు. జైపూర్ పోలీసులు తిరుపతికి వచ్చి అరెస్టు చేయడంతో నేను చెప్పింది నిజమైంది' అని జనసేన నేత కిరణ్‌రాయల్ అన్నారు. సోమవారం సాయంత్రం ఆయన మీడియాతో మాట్లాడారు. 'జగన్ 2.0' పోస్టర్ విడుదల చేశాక వైసీపీ నాయకులు కుట్రపన్ని తన రాజకీయ జీవితాన్ని అణిచివేయాలని చూశారన్నారు. వైసీపీ స్వార్థ రాజకీయాలకోసం మహిళను వాడుకున్నారని, పర్యవసానంగా ఆమె ఎక్కడవుందా? అని వెతుకుతున్న జైపూర్ పోలీసులకు దొరికిపోయిందన్నారు. ఆడవాళ్లను అడ్డుపెట్టుకుని రాజకీయం చేయడం వైసీపీకే చెల్లిందన్నారు. పార్టీకి చెడ్డపేరు వస్తుందంటే తాను చావడానికైనా సిద్ధమన్నారు. కోర్టులో న్యాయం గెలుస్తుందని, తనకు అండగా ఉన్న జనసేన కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

ఎస్వీయూ ఘటనలో ఇద్దరి అరెస్టు

● గంజాయి, హత్యాయత్నం కింద కేసులు నమోదు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ హాస్టల్‌లోని ఇద్దరు విద్యార్థులపై ఆదివారం రాత్రి కత్తితో దాడి చేసిన ఘటనలో నిందితులపై గంజాయి, హత్యాయత్నాల కింద కేసు నమోదు చేసి సోమవారం అరెస్టు చేశారు. ఎస్వీయూ సీఐ రామయ్య కథనం మేరకు.. వెంకటగిరి మండలానికి చెందిన మణికంఠ తిరుపతిలో జులాయిగా తిరుగుతున్నాడు. సులభంగా డబ్బు సంపాదించడానికి అలవాటు పడ్డాడు. ఎక్కడపడితే అక్కడ రౌడీయిజం చేయడం, అవసరమైతే హత్యాయత్నాలకు పాల్పడడం అలవాటుగా మారింది. దీంతో మణికంఠపై వర్శిటీ పోలీసులు రౌడీషీట్ ఓపెన్ చేశారు. ఈ క్రమంలో ఎస్వీయూలో ఉన్న ఓ వైసీపీ విభాగం నాయకుడితో కలిసి వర్శిటీకి వస్తుంటాడు. ఈ క్రమంలో కడప జిల్లాకు చెందిన మరో విద్యార్థి పరిచయమయ్యాడు. రోజూ అతడి గదికి రాత్రి సమయాల్లో వచ్చి మద్యం తాగేవారు. ఇది రూమ్‌మేట్ హరికి నచ్చక మరో రూముకు వెళ్లి చదువుకునే వాడు. శనివారం రాత్రి రూము నెంబరు 18 వద్ద చదువుకుంటున్న హరి వద్దకు మణికంఠ, అతడి స్నేహితుడు, వర్శిటీ విద్యార్థి అయిన యోగేశ్వర్ వచ్చారు. తాను గదికి వస్తే.. నువ్వు ఇక్కడికి ఎందుకు వస్తున్నావంటూ హరితో మణికంఠ గొడవపడ్డాడు. తమ గది వద్దకు వచ్చి ఎందుకు గొడవ చేస్తున్నావంటూ వెంకటేష్‌బాబు నిలదీశారు. అప్పటికే మద్యం, గంజాయి మత్తులో ఉన్న మణికంఠ అతడిపై కత్తితో దాడి చేశాడు. వర్శిటీ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునిమణికంఠ, యోగేశ్వర్‌పై గంజాయి, హత్యాయత్నం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

హాస్టళ్లలో బయటి వ్యక్తులుంటే చర్యలు



హాస్టల్‌ను పరిశీలిస్తున్న వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతినాయుడు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ హాస్టళ్లలో బయటి వ్యక్తులుంటే కఠిన చర్యలు తీసుకుంటామని వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు స్పష్టంచేశారు. ఆదివారం రాత్రి హెచ్-బ్లాక్ హాస్టల్లో చోటు చేసుకున్న ఘటన నేపథ్యంలో సోమవారం వీరు పరిశీలించారు. గాయపడిన విద్యార్థిని పరామర్శించారు. హాస్టళ్లలో సమస్యలకు కొందరు సిబ్బంది తీరు కూడా కారణమని పలువురు విద్యార్థులు అధికారుల దృష్టికి తెచ్చారు. దీంతో, బయటి వ్యక్తుల గురించి అధ్యయనం, చర్యల కోసం ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ కమిటీ నివేదిక అందిన వెంటనే యూనివర్సిటీ హాస్టళ్లలోని బయటి వ్యక్తులు, వారికి ఆశ్రయం కల్పిస్తున్న సిబ్బంది, విద్యార్థులపైనా కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు. బయటి వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఇప్పటికే ఎస్పీకి కూడా ఫిర్యాదు చేసినట్టు చెప్పారు.

లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వం గీత కార్మికులకు కేటాయించిన 23 మద్యం దుకాణాలను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సోమవారం లాటరీ ద్వారా డిప్ తీసి అర్హులైన వారికి కేటాయించారు. తద్వారా ప్రభుత్వానికి లైసెన్సు ఫీజు కింద రూ.4.60 లక్షల ఆదాయం లభించింది.

మహాశివరాత్రి ఉత్సవాలకు రండి


● సీఎం చంద్రబాబుకు ఎమ్మెల్యే, అధికారుల ఆహ్వానం



సీఎం చంద్రబాబుకు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తిలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆలయ అధికారులు, అర్చకులు ఆహ్వానించారు. సచివాలయంలో సీఎంను సోమవారం వీరు కలిసి ఆహ్వాన పత్రికను లాంఛనంగా అందజేశారు. ఆలయ వేదపండితులు సీఎంకు తీర్థప్రసాదాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాన్ని అందజేశారు. వేదాశీర్వాదమిచ్చారు. ఉత్సవ ఏర్పాట్లపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, అధికారులతో చంద్రబాబు మాట్లాడారు. ఈవో బాపిరెడ్డి, ప్రధాన అర్చకుడు సంబంధం గురుకుల్, డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీజీ, పీహెచ్‌డీ సెట్స్ కన్వీనర్‌గా వెంకటేశ్వర్లు



నియామక ఉత్తర్వులు స్వీకరిస్తున్న ప్రొఫెసర్ పీసీ వేంకటేశ్వర్లు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల్లో పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాల కోసం చేపట్టనున్న ఏపీపీజీసెట్, ఏపీపీహెచ్‌డీ సెట్ కన్వీనర్‌గా ఎస్వీయూ ఓఆర్ఐ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. ఈ నియామక ఉత్తర్వులను ఎస్వీయూ వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ భూపతి నాయుడు నుంచీ ఆయన సోమవారం అందుకున్నారు.

పుస్తకాలపై దాడి అనాగరికం : సాహిత్యవేత్తలు

జిల్లా ఎస్పీకి ఫిర్యాదు



పుస్తకాలను ప్రదర్శిస్తున్న పుస్తక, సాహిత్యాభిమానులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు, ఆటోనగర్), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సాహిత్యం కుట్ర కాదు, రచయితలు కుట్రదారులు కాదని పలువురు సాహిత్యవేత్తలు స్పష్టం చేశారు. తిరుపతి పుస్తక ప్రదర్శనపై దాడికి నిరసనగా సోమవారం సాయంత్రం తిరుపతిలో పుస్తక, సాహిత్యాభిమానులు సమావేశమయ్యారు. 17వ తిరుపతి పుస్తక ప్రదర్శనలో శనివారం కొందరు దాడి చేసి బీభత్సం చేసిన సంఘటనను ఖండించారు. సమాజంలో భిన్నాభిప్రాయాలకు చోటుండాలన్నారు. లేకపోతే మానవ మనుగడే ప్రమాదంలో పడిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం తిరుపతి ప్రతిష్టకు భంగం కలిగేలా ప్రవర్తించిన దుండగులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జిల్లా ఎస్పీని కలిశారు. 17 ఏళ్లుగా ఎంతో గౌరవంగా జరుగుతున్న పుస్తకోత్సవాల గురించి వివరించారు. దాడి సంఘటన వీడియోలను ఎస్పీకి చూపించారు. దాడికి గురైన విశాలాంధ్ర పుస్తకాల షాప్ ప్రతినిధి శంకర్‌ను విచారించి, వెంటనే చర్యలకు ఆదేశించిన ఎస్పీకి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐక్యవేదిక నాయకులు పి.అంజయ్య, రాఘవ, వాకా ప్రసాద్, పరమేశ్వర్, ఒ. వెంకటరమణ, అజీమ్ బాష, రామానాయుడు, వందవాసి నాగరాజు, విశ్వనాథం, సాయిలక్ష్మి, హేమలత, జయంతి, వెంకటాద్రి, హరీష్ పాల్గొన్నారు.

నేడు పుస్తక ప్రియుల ర్యాలీ

తిరుపతి పుస్తక ప్రదర్శనపై దాడిని నిరసిస్తూ మంగళవారం తిరుపతిలో పుస్తక ప్రియులు పుస్తకాలు చేతబట్టి ర్యాలీ నిర్వహించనున్నారు. సాయంత్రం 4:30 గంటలకు బాలాజీ కాలనీలోని పూలే విగ్రహం నుంచీ నాలుగుకాళ్ళ మండపం దాకా ఈ ర్యాలీ సాగనుంది. రచయితలు, కవులు, సాహిత్యాభిమానులు తమకు నచ్చిన పుస్తకాలను పట్టుకొని ఈ ప్రదర్శనలో పాల్గొనాలని తిరుపతి పుస్తక ప్రియుల ఐక్య వేదిక కన్వీనర్ వాకా ప్రసాద్ కోరారు.

దొంగలపై స్పెషల్ ఫోకస్

● ముమ్మరంగా కార్డెన్ సెర్చ్‌లు ● పాత నేరస్థుల కదలికలపై నిఘా

● థార్, పార్థు గ్యాంగ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలంటూ ఎస్పీ ఆదేశాలు

తిరుపతి (నేరవిభాగం), ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వరుస దొంగతనాలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. దొంగలపై స్పెషల్ ఫోకస్ పెట్టారు. దొంగతనాలు, హౌస్ బ్రేకింగ్‌లు, చైన్ స్నాచింగ్‌ల కట్టడికి చర్యలు తీసుకుంటున్నారు. పోలీసు సర్కిళ్ల వారీగా బృందాలను ఏర్పాటు చేసి ఎస్పీ హర్షవర్ధనరాజు విధులు కేటాయించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 10 గంటల వరకు హోంగార్డుల నుంచి అదనపు ఎస్పీల వరకు రోడ్లపై ఉండి.. విజువల్ పోలీసింగ్ గట్టిగా చేయాలని ఆదేశించారు. మరోవైపు జైళ్ల నుంచి విడుదలైన వారు, పాత నేరస్థుల కదలికలపై దృష్టి సారించారు. ఇప్పటికే సబ్ డివిజన్ల వారీగా రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చే పని మొదలు పెట్టిన పోలీసులు.. ఆయా పోలీసు స్టేషన్లలోని నేరస్థుల జాబితాలు పరిశీలిస్తున్నారు. నేరస్థుల చిట్టాను సిద్ధం చేస్తున్నారు. ఎక్కడెక్కడ ఎవరు ఎలాంటి నేరాలకు పాల్పడ్డారు? థార్, పార్థు గ్యాంగ్‌లు గతంలో ఎక్కడైనా చోరీలు, హౌస్ బ్రేకింగ్‌లకు పాల్పడ్డారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. వారి వేలిముద్రలు బయటకు తీసి మళ్లీ పరిశీలిస్తున్నారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు దాదాపు 340 మంది పాత నేరస్థులు వున్నట్లు సమాచారం.

డీజీపీ ఆదేశాలతో కదలిన యంత్రాంగం

డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాలతో జిల్లా పోలీసు యంత్రాంగంలో కదలిక వచ్చింది. ఏకాంత కాలనీలు, శివారు ప్రాంతాలు, ఖరీదైన విల్లాల్లో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. వెంకటగిరి, బాలయ్యపల్లి, డక్కిలి, శ్రీకాళహస్తి, తిరుపతి, నాయుడుపేట, డీవీ సత్రం, వెంకటగిరి ప్రాంతాల్లో సోమవారం ఆయా డీఎస్పీల ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. 153 వాహనాలకు ఎలాంటి రికార్డులు లేకపోవడంతో వాటిని సీజ్ చేశారు. ఇలాంటి కార్డెన్ సెర్చ్‌లు నిరంతరం కొనసాగిస్తామని ఎస్పీ హర్షవర్ధన రాజు చెప్పారు. వీటితో పాటు నైట్ పెట్రోలింగ్, విజువల్ పోలీసింగ్, మొబైల్ వాహనాల్లో గస్తీ తిరగడం వంటి వాటిని మరింత పటిష్ట పరచడానికి చర్యలు తీసుకున్నారు.



మహేష్ ఇన్‌స్టా పేజీ

'డిజిటల్ కవి' అనే పదం కొత్తగా ఉండొచ్చు. సాధారణంగా కవులు తమ రచనల్ని పుస్తకాల రూపంలో పాఠకులకు అందిస్తూ ఉంటారు. ఇప్పటి పరిస్థితుల్లో పుస్తకాలు చదివేవారి సంఖ్య తగ్గిపోయింది. కవులకూ ఆదరణ లేకుండా పోతోంది.చిత్తూరుకు చెందిన ఓ యువకుడు సంప్రదాయ రచయితల్లా పుస్తకాలకు పరిమితం కాకుండా తన రచనల్ని పాఠకులకు చేరేలా డిజిటల్ ప్లాట్‌ఫాంను ఎంచుకున్నాడు. తన భావాల్ని ఇన్‌స్టాగ్రామ్ పేజీలో పంచుకుంటున్నాడు. ప్రేమకు సంబంధించిన చిట్టి కవితలకు వ్యూయర్స్ ఎక్కువగా ఉన్నారు. ఓ సాధారణ రైటింగ్ పేజీకి లక్ష మంది ఫాలోవర్స్ ఉన్నారంటే సాధారణ విషయం కాదు. దీంతో అతనికి సినిమాల్లోనూ డైలాగ్ రైటర్‌గా అవకాశాలు దక్కుతున్నాయి.కథలు రాసుకుని డైరెక్షన్ చేసేందుకూ సిద్ధమవుతున్నాడు .

-చిత్తూరు, ఆంధ్రజ్యోతి

మహేష్ విద్మహీ ఓ డిజిటల్ కవి..!

● వినూత్నంగా ఇన్‌స్టాలో రచనలు ● లక్షమంది ఫాలోవర్స్
● వరుస కడుతున్న సినిమా అవకాశాలు



మహేష్

చందమామ కథల ప్రభావం

చిత్తూరు మండలం శేషాచలపురం గ్రామానికి చెందిన మహేష్ తల్లి మంజుల రిటైర్డ్ ప్రభుత్వ ఉపాధ్యాయురాలు. తండ్రి వేదమూర్తిరెడ్డి కూడా రిటైర్డ్ ప్రైవేటు టీచర్. చిన్నప్పుడు వాళ్లు చెప్పే కథలు మహేష్ మీద ప్రభావం చూపాయి. చందమామ, బాలమిత్ర కథలు విని వాటిని విజువలైజేషన్ చేసుకునేవాడు. ఇంటర్ వరకు చిత్తూరులో, బీటెక్ తిరుపతిలో (2015) చదివిన మహేష్ విద్యార్థి దశలోనే చిన్న చిన్న కథలు రాసి తోటి విద్యార్థులకు చెప్పి సంబరపడేవాడు.

మంచి అవకాశాలు..

తొలుత ఇన్‌స్టాలో రచనలు పోస్టు చేస్తూ ఫేమస్ అయిన మహేష్‌కు ఇప్పుడు సినిమాల్లో డైలాగ్ రైటర్‌గా కూడా అవకాశాలొస్తున్నాయి.రాయచోటికి చెందిన ప్రముఖ హీరో కిరణ్ అబ్బవరం త్వరలో తీయనున్న సినిమాకు.. ఇటీవల చిన్న సినిమాగా విడుదలై పెద్ద విజయం సాధించిన 'కమిటీ కుర్రోళ్లు' నిర్మాణ సంస్థ పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ వారు తీస్తున్న మరో సినిమాకు, కొత్తవారితో తీస్తున్న కపర్ది అనే సినిమాకు డైలాగ్ రైటర్‌గా పనిచేస్తున్నారు. జనవరి 15న పుట్టినరోజు వేడుకల్ని ఘనంగా జరుపుకున్న చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌కు 'ప్రజలందరి కోసమని.. ప్రజలే తన సైన్యమని..', 'ప్రజలే తన ప్రాణమని జనబలమై కదిలినాడు..' అనే రెండు పాటలు కూడా రాసిచ్చారు. కొన్ని విభిన్న కథల్ని రాసుకుని డైరెక్షన్ చేసేందుకు నిర్మాతల వద్దకు కూడా తిరుగుతున్నారు. ఇప్పటికే 'ఈవెన్ ది గాడ్స్ మస్ట్ బి హంగ్రీ' అనే షార్ట్‌ఫిలిమ్ ఆకలి గురించి తీసి దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు కోసం పంపించారు.

పోస్టు పెడితే లక్ష వ్యూస్

కొవిడ్ లాక్‌డౌన్ సమయంలో 'మహేష్ విద్మహీ' ఇన్‌స్టాగ్రామ్ పేజీని ప్రారంభించారు. విద్మహీ అనేది అతడి కలం పేరు. 'అక్షరం కూడా ఓ ఆయుధం- ఇదే నా సిద్ధాంతం' అనే ట్యాగ్‌తో ఉన్న ఈ ఇన్‌స్టా పేజీలో ప్రస్తుతం లక్షమంది ఫాలోవర్స్ ఉన్నారు. నిజ జీవితంలోని కామన్ ఎమోషన్స్, మోటివేషనల్, ఇన్‌స్పిరేషనల్ పోస్టులను మంచి మ్యూజిక్ జత చేసి పెడుతుంటారు. ఆయన ఏం రాసి పోస్టు పెట్టినా కనీసం 50 వేల మంది నుంచి లక్ష మంది వరకు చదువుతున్నారు. కొన్ని రచనల్ని 20 లక్షల మంది కూడా చదివారంటే అతని రచనల ప్రభావం తెలుస్తోంది.

త్వరలో రెండు పుస్తకాలు

మహేష్ రాసిన పది కథలను పుస్తకంగా ప్రచురించనున్నారు.మనిషి పుట్టుక నుంచి చావు దాకా అతని జీవితంలో ఎదురైన ఆయా సంఘటనల గురించి నేర్చుకున్న జీవిత పాఠాలతో మరో పుస్తకం రాశారు. 'కథలో చివరి పేజీ కూడా బాగుండాలంటే.. బీజం మొదటి పేజీలోనే పడాలి. మనిషి జీవితం కూడా అలాగే'.. 'నేను చేసే యుద్ధంలో ఓటమికి కూడా విలువ ఉండాలి..' వంటి థీమ్స్‌తో పుస్తకం ఉంటుంది. మార్చిలో ఒకటి, ఏప్రిల్‌లో మరోటి ఆవిష్కరించనున్నారు.

ఇప్పుడు పుస్తకాలు చదవడం బాగా తగ్గిపోయింది. రచనలు అవసరమైన వారి వరకూ చేరడం లేదు. ఓ రకంగా చెప్పాలంటే డిజిటల్ యుగంలో ప్రింటింగ్ వెనుకబడింది. అంతా సోషల్ మీడియామే. అందుకే నేను నా రచనలు రీచ్ అయ్యేందుకు సోషల్ మీడియాను ఎంచుకున్నా. క్లిక్ అయ్యా. నేను రాసింది ఈ తరానికి అందాలంటే ఇదే తగిన వేదిక.

- మహేష్ విద్మహీ

కోటపల్లి వద్ద ఒంటరి ఏనుగు విధ్వంసం


ఏనుగు దాడిలో విరిగిపోయిన మామిడిచెట్లు

కల్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళెం పంచాయతీ కోటపల్లి వద్ద ఆదివారం రాత్రి ఒంటరి ఏనుగు విధ్వంసం సృష్టించింది. కోటపల్లి సరిహద్దులోని అటవీప్రాంతం నుంచి ఒంటరి ఏనుగు గ్రామంలోని రైతు దామోదర్‌నాయుడుకు చెందిన మామిడితోటలోకి ప్రవేశించింది. ఆరు మామిడి చెట్లను విరిచేసింది. సమీపాల్లోని రైతుల మామిడిచెట్లను విరిచేసింది.

రోడ్డు పనుల్లో విషాదం

- జిలెటిన్ స్టిక్ పేలి ఒకరి దుర్మరణం
- మరో కార్మికుడికి తీవ్రగాయాలు


ఆంజనేయులు మృతదేహం


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ రమేష్‌బాబు


సీఎంసీలో చికిత్స పొందుతున్న యాదిగిరి

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పనుల్లో విషాద సంఘటన జరిగింది. జిలెటిన్ స్టిక్ పేలి ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. తాలూకా ఎస్‌ఐ రమేష్‌బాబు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు రూరల్ మండలం ఉయ్యాలచింత గ్రామం మీదుగా బెంగళూరు- చెన్నై రోడ్డు పనులు జరుగుతున్నాయి. ఆదివారం బండను పేల్చడానికి కార్మికులు జిలెటిన్ స్టిక్స్ పేల్చారు. ఈ క్రమంలో ఓ చోట అమర్చిన జిలెటిన్ స్టిక్‌ను మరచి.. సోమవారం అదే ప్రాంతంలో డ్రిల్లింగ్ చేస్తుండగా అది పేలింది. అక్కడున్న ఆంజనేయులు అనే కార్మికుడు తీవ్రగాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. యాదగిరి అనే కార్మికుడికి తీవ్రగాయాలవగా చీలాపల్లె సీఎంసీకి తరలించారు. కార్మికులిద్దరిదీ కూడా నల్గొండ జిల్లా అని తేలింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పట్టు యంత్రాల సరఫరాకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా పట్టు పరిశ్రమ ద్వారా పట్టు రైతులకు యంత్రాలు, గార్డెన్ టూల్స్ సరఫరా చేసేందుకు వివిధ సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీకేచర్లు, పవర్ స్ప్రేయర్లు, బ్రష్‌కట్టర్, పవర్ ఫీడర్, టిల్లర్, షూట్ క్రషింగ్ మెషిన్, హ్యాండ్ బ్యాటరీ ఆపరేటెడ్ స్ప్రేయర్ కోసం ఈనెల 17వ తేదీవరకు కాంట్రాక్టర్ల నుంచి టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. పనివేళల్లో టెండర్లను పట్టు పరిశ్రమ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్స్‌లో వేయాలన్నారు. ఇతర వివరాలకు 98499 03449 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

2200 గృహ నిర్మాణాలకు ఆమోదం!

చిత్తూరు సెంట్రల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి) : ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 కింద జిల్లాలో 2200 గృహ నిర్మాణాలకు ఆమోదం లభించింది. గృహ నిర్మాణాల కోసం పీఎంఏవై కింద వచ్చిన దరఖాస్తులను పరిశీలించిన జిల్లా గృహ నిర్మాణ శాఖాధికారులు డీటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు (డీపీఆర్)ను సిద్ధం చేసి సోమవారం ప్రభుత్వానికి పంపారు.మున్సిపాలిటీల వారీగా....నగరిలో 315 గృహాలు, పలమనేరులో 145, కుప్పంలో 896, చిత్తూరులో 665, పుంగనూరులో 179 గృహ నిర్మాణాలకు దరఖాస్తులను ఖరారు చేశారు.కొత్తగా ఇళ్లు నిర్మించుకునేందుకు వచ్చే వారినుంచి మార్చి తర్వాత దరఖాస్తులు స్వీకరించనున్నట్లు హౌసింగ్ పీడీ గోపాలనాయక్ తెలిపారు.

సర్వేయర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలి



సర్వేయర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంజుల

కుప్పం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి):సర్వేయర్ల సమస్యలపై ప్రభుత్వం స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా సర్వేయర్ల సంఘ అధ్యక్షురాలు మంజుల డిమాండు చేశారు.కుప్పంలో జరిగిన సమావేశంలో పలు సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళాలని నిర్ణయం తీసుకున్నారు. విలేజ్ సర్వేయర్లకు గ్రేడ్-1 ప్రమోషన్లు కల్పించి, నూతనంగా పరీక్షల నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. రీ సర్వే జరిగిన గ్రామాల్లో మిగిలిన సరిహద్దు రాళ్లను నాటే వాటిపై వెసులుబాటు కల్పించాలన్నారు. త్వరలో జరిగే రేషనలైజేషన్‌లో సర్వేయర్లకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మహిళా సర్వే ఉద్యోగులంతా సాయంత్రం 6 గంటల లోపు పని ముగించుకుని వెళ్ళేలా వెసులుబాటు కల్పించాలన్నారు. జిల్లా సంఘ కోశాధికారి రత్నప్ప తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలే అధికం

● కలెక్టరేట్‌లో 'పీజీఆర్ఎస్'కు 253 అర్జీలు


బాధితురాలితో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి 253 అర్జీలను బాధితులు అందజేశారు. ఎక్కువ మంది రెవెన్యూ సమస్యల పైనే అర్జీలు సమర్పించారు. రెవెన్యూశాఖకు 145, డీఆర్‌డీఏకు 39, పంచాయతీ రాజ్‌కు 4, చిత్తూరు నగరపాలక సంస్థకు 6, పశు సంవర్ధకశాఖకు 5, డీసీహెచ్ఎస్‌కు 7, ఎంపీడీవోలు, గిరిజన సంక్షేమశాఖ, ఎంప్లాయిమెంట్, ప్రభుత్వ ఐటీఐ, తదితర శాఖలకు 47 చొప్పున అర్జీలు ఉన్నాయి. బాధితుల నుంచి వినతిపత్రాలను జేసీ విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో మోహన్‌కుమార్, చిత్తూరు ఆర్డీవో శ్రీనివాసులుతో కలిసి కలెక్టర్ సుమిత్‌కుమార్ స్వీకరించారు.

ప్రధాన సమస్యలిలా..

● వ్యవసాయ కాలువలు పూడిపోవడంతో చెరువులో నీళ్లున్నా భూములకు నీళ్లురాని పరిస్థితి నెలకొందని జీడీ నెల్లూరు మండలం వీరకనెల్లూరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రెండు కిలోమీటర్ల మేరకు కాలువ పూడిపోయిందన్నారు.

● ప్రభుత్వం తమకు సర్వే నెంబరు 87-42లో ఇచ్చిన 0.79 సెంట్ల భూమిలో సాగు చేసుకుంటున్న తమను అగ్రకులస్తులు అడ్డుకుంటున్నారని బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట పంచాయతీలోని గౌరీశంకర నారాయణపురానికి చెందిన రామచంద్ర, మునస్వామి ఫిర్యాదు చేశారు.

● సర్వే నెంబర్లు కలిసిపోవడంతో తమ భూమిని కాజేయడానికి ప్రయత్నిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.

2001లో ప్రభుత్వం తనకు 2.87 ఎకరాల భూమిని ఇచ్చిందని కార్వేటినగరం మండలం ఎల్ఆర్‌పేట పంచాయతీలోని జగన్నాథపురం ఎస్టీకాలనీకి చెందిన శ్రీరాములు తెలిపారు. రాళ్లురప్పలుగా ఉన్న భూమిని చదును చేసుకుని 20 ఏళ్ల క్రితం మామిడి మొక్కలు నాటుకున్నానని చెప్పారు. తన భూమికి పడమర వైపున నాగరాజు అనే రైతు భూమి ఉండేదని, దాన్ని వేరేవాళ్లకు విక్రయించాడన్నారు. అందులో తన భూమికి సంబంధించిన సర్వే నెంబరు కలిసిపోవడంతో వారు తన భూమిని తీసుకోవడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. విచారించి న్యాయం చేయాలని కోరాడు.

పాఠశాలకు భూమి ఇవ్వండి



ఆళ్లమడుగు లెక్క దాఖలాలోని సర్వే నెంబరు 31లో 23 కుటుంబాల వారికి ప్రభుత్వం ఇళ్ల స్థలాలను కేటాయించడంతో ఇండ్లను కట్టుకుని ఉంటున్నామని వెదురుకుప్పం మండలం పల్లాలు పంచాయతీలోని ఎస్టీకాలనీ వాసులు తెలిపారు. తమ కాలనీకి పడమర వైపున 1.36 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందన్నారు. ఈ భూమిని పాఠశాల, కమ్యూనిటీ హాలు నిర్మాణానికి, ఇండ్ల స్థలాలకు కేటాయించాలని కోరారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోండి



గ్రామస్తులపై దౌర్జన్యం చేయడంతోపాటు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని సదుం మండలం తిమ్మినాయనిపల్లె ఆయకట్టు రైతులు కోరారు. ఆయన్ను బదిలీ చేయడంతోపాటు అవినీతి, అక్రమాలపై విచారణ చేయాలన్నారు.

పాడి రైతును ఆదుకోండి



పాడి రైతును ఆదుకోవాలని రైతు ఉద్యమ నేత వెంకటాచలం నాయుడు కోరారు. కలెక్టరేట్ ముందు ప్రైవేటు డెయిరీకి చెందిన పాల ప్యాకెట్‌తో నిరసన తెలిపారు. పాడి రైతుకు ప్రైవేటు డెయిరీల వారు లీటరుకు రూ.30-35వరకు ఇస్తున్నారని చెప్పారు. అదే లీటరు పాలను ప్రైవేటు డెయిరీలు రూ.60 వరకు అమ్ముకుంటున్నాయన్నారు. రైతులకిచ్చే తగిన ధరను ప్రైవేటు డెయిరీలు ఇచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాత బస్టాండ్‌ను యథావిధిగా కొనసాగించాలి



పాత బస్టాండ్‌ను యథావిధిగా కొనసాగించాలని పాత బస్టాండ్ షాప్‌కీపర్స్ అసోసియేషన్ నేతలు డిమాండ్ చేశారు. ఉన్నట్టుండి షాపులను ఖాళీ చేయమంటే కుటుంబాలను ఎలా పోషించాలని ప్రశ్నించారు.

జిల్లా పోలీసు కార్యాలయానికి 25 అర్జీలు


అర్జీని పరిశీలిస్తున్న ఎస్పీ మణికంఠ

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 25 అర్జీలు అందాయి. బాధితుల నుంచి ఎస్పీ మణికంఠ వినతిపత్రాలను స్వీకరించారు. భూ తగాదాపై 10, డబ్బు తగాదాపై 7, వేధింపులపై 3, కుటుంబ తగాదాపై 2, చీటింగ్, ఇంటి తగాదా, ఆస్తి తగాదాలపై ఒక్కో అర్జీ వంతున అందాయి.

ప్రాణభిక్ష పెట్టండి

- రెండు కిడ్నీలు పాడైన షణ్ముగం వేడుకోలు


షణ్ముగం - పోలియో, శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్న షణ్ముగం కుమారుడు లవన్‌కుమార్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): తనకు ప్రాణభిక్ష పెట్టాలని రెండు కిడ్నీలు పాడైన చిత్తూరు నగరంలోని సాంబయ్యకండ్రిగకు చెందిన షణ్ముగం(46) వేడుకుంటున్నాడు. ఆయన మాటల్లోనే.. 'నేను ఏ రోజుకా రోజు మేస్త్రీ పనికెళితేనే నా కుటుంబం గడుస్తుంది. నా కుమారుడు లవన్‌కుమార్ (22)కు పుట్టినప్పటి నుంచే పోలియో. దానికితోడు శ్వాసకోశ వ్యాధితో బాధపడుతున్నాడు. నా భార్య దగ్గరుండి బిడ్డను చూసుకోవాలి. ఈ పరిస్థితుల్లో రెండు నెలల కిందట నేను పనిచేస్తున్న చోటే కళ్లు తిరిగి కిందపడ్డాను. చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి వెళ్లగా వైద్య పరీక్షలు చేశారు. అక్కడి వైద్యుల సలహాతో తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో పరీక్షలు చేయించాను. రెండు కిడ్నీలు పాడయ్యాయని తేలింది. కిడ్నీ మార్పిడి చేయాలని, రూ.15 లక్షల వరకు ఖర్చవుతుందని చెప్పారు. నా దగ్గర అంత డబ్బు లేదు. కిడ్నీ మార్పిడి చేసుకునేవరకు డయాలసిస్ చేయాలన్నారు. అందుకోసం ఓ యంత్రం అమర్చారు. దీనికోసం సుమారు రూ.50వేల వరకు ఖర్చవగా, ఈ మొత్తాన్నీ అప్పు చేయాల్సి వచ్చింది. మరోవైపు నా కుమారుడికి తరచూ నెబ్యులైజేషన్ చేయాల్సి రావడం, నెలకో ఆక్సిజన్ సిలిండర్, మందులు అవసరం అవుతున్నాయి. నా భార్య కూలి పనులకు వెళ్లినా వచ్చే డబ్బు దేనికీ సరిపోవడం లేదు' అని తన దయనీయ పరిస్థితిని చెప్పి షణ్ముగం కన్నీరు పెట్టుకున్నాడు. చిత్తూరు ఎమ్మెల్యే జగన్మోహన్ స్పందించి సీఎం రిలీఫ్ ఫండ్ కింద కిడ్నీ మార్పిడి చేయించి తన ప్రాణాన్ని కాపాడాలని వేడుకుంటున్నాడు. తనకు ఆపరేషన్ జరిగేవరకు దాతలు ఆర్థికంగా సాయం చేయాలని రెండు చేతులెత్తి మొక్కుతున్నాడు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ వర్కర్, మినీ వర్కర్, ఆయా పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు అంగన్‌వాడీ వర్కర్లు, రెండు మినీ అంగన్‌వాడీ వర్కర్లు, 20 ఆయా పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఖాళీల వివరాలు ఆయా సీడీపీవో కార్యాలయంలో కేంద్రాల వారీగా, పోస్టులు, రోస్టర్ వారీగా ఉన్నాయని పేర్కొన్నారు. ఆసక్తి, అర్హులైనవారు ఈనెల 12 నుంచి 22వ తేదీలోపు దరఖాస్తులను ఆయా సీడీపీవోలకు అందించాలని కోరారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మేదర, కుమ్మరి శాలివాహన సామాజిక వర్గానికి చెందిన గ్రూపు సభ్యులకు ప్రభుత్వం సబ్సిడీ రుణాలను మంజూరు చేసిందని బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీదేవి ఒక ప్రకటనలో తెలిపారు. రుణాలు పొందాలంటే కనీసం గ్రూపులో మూడు నుంచి ఐదుగురు సభ్యులు, 21-60 ఏళ్ల వయసు ఉండాలన్నారు. ఒక గ్రూపునకు ప్రభుత్వ సబ్సిడీ రూ.1.50 లక్షలు, బ్యాంకులోను రూ.1.50 లక్షలతో కలిపి రూ.3 లక్షలుగా ఇస్తారన్నారు. ఆసక్తి ఉన్నవారు కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రేషన్, ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాలతో సచివాలయాల్లోని డిజిటల్ సహాయకుల సహకారంలో ఆన్‌లైన్‌లో ఈనెల 12వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు ఏఈవో బాబురెడ్డిని 99081 32043 నెంబరులో సంప్రదించాలని కోరారు.

11కేవీ విద్యుత్ తీగలపై పడ్డ తొండ

- ఐరాల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో షార్ట్ సర్క్యూట్
- కంప్యూటర్లు, ఫ్యాన్లు కాలిపోయాయి
- సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం


తహసీల్దార్ కార్యాలయంలో కాలిపోయిన కంప్యూటర్ - ఎంపీడీవో కార్యాలయంలో కాలిపోయిన ఫ్యాను, దగ్ధమైన విద్యుత్ మీటర్

ఐరాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఓ తొండ 11కేవీ విద్యుత్ తీగలపై పడటంతో ఐరాల తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాల్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. సుమారు రూ.20లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. సోమవారం సాయంత్రం 4.30 గంటలప్పుడు ఎంపీడీవో, తహసీల్దారు కార్యాలయాల్లోని సిబ్బంది పనుల్లో బిజీగా ఉన్నారు. ఉన్నట్టుండి తొలుత పెద్ద శబ్దం వచ్చింది. ఆ తర్వాత షార్ట్ సర్క్యూట్ జరిగి.. ఎంపీడీవో కార్యాలయ భవనంలో ఫ్యాను నుంచి మంటలు రావడంతోపాటు నిప్పురవ్వలు ఎంపీడీవో ధనలక్ష్మిపై పడటంతో ఆమె భయంతో అరుస్తూ బయటకు పరుగులు పెట్టారు. అలాగే తహసీల్దార్ కార్యాలయంలోనూ ఇలానే జరగడంతో ఉద్యోగులు, లబ్ధిదారులు కార్యాలయం బయటకు నుంచి పరుగులు పెట్టారు. ఆ సమయంలో అక్కడున్న జనం కూడా కొంతసేపు ఏం జరిగిందో అర్థంకాక భయభ్రాంతులకు గురయ్యారు. దాదాపు 15 నిమిషాలపాటు గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు కార్యాలయాల వద్ద పొగ కమ్ముకుంది. ఈ ప్రమాదంలో తహసీల్దార్ కార్యాలయంలో ఐదు కంప్యూటర్లు, మూడు ప్రింటర్లు, వీడియో కాన్ఫరెన్స్ టీవీ, ఆరు ఫ్యాన్లు, ఎంపీడీవో కార్యాలయంలో తొమ్మిది కంప్యూటర్లు, మూడు ప్రింటర్లు, ఆరు ఫ్యాన్లు, ఏపీవో కార్యాలయంలో ఓ కంప్యూటర్‌తోపాటు బోరు మోటరు, పలు సీసీ కెమెరాలు కాలిపోయాయి. విద్యుత్ మీటరు కూడా దగ్ధమైంది. సుమారు రూ.20 లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని అధికారులు తెలిపారు.

విద్యుత్ తీగలపై తొండ పడటం వల్లే..


తహసీల్దార్ మహేష్‌కుమార్‌తో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఏఈ నీరజ

ప్రమాద విషయాన్ని తెలుసుకున్న ఐరాల ట్రాన్స్‌కో ఏఈ నీరజ సంఘటనా స్థలానికి విచ్చేసి పరిస్థితిని పర్యవేక్షించారు. ఓ తొండ 11 కేవీ విద్యుత్ తీగలపై పడటం వల్లే ఈ ప్రమాదం జరిగిందని గుర్తించారు. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాకపోవడంతో ఉద్యోగులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. తహసీల్దార్ మహేష్‌కుమార్ సంఘటనా స్థలంలోనే ఉండి పరిస్థితులను పర్యవేక్షించారు. ఎంపీడీవో సంఘటన జరిగిన వెంటనే వెళ్లిపోవడం చర్చనీయాంశమైంది.

శ్రీవారితో ఆటలాడిన వారు మూల్యం చెల్లించుకోక తప్పదు: గౌనివారి

శాంతిపురం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారితో ఆటలాడిన వారు ఎంతటి వారైనా మూల్యం చెల్లించుకోక తప్పదని మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. శ్రీవారి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడకంలో ప్రమేయం ఉన్న వారిని ఒక్కొక్కరిగా సిట్ అరెస్టు చేస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం టీడీడీ ప్రతిష్ట, పవిత్రతను కాపాడుతూ భక్తులకు మెరుగైన సేవలందించేలా చర్యలు చేపట్టిందని వివరించారు.

ముమ్మరంగా పారిశుధ్య పనులు

వి.కోట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): వి.కోట మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో ముమ్మరంగా పారిశుధ్య పనులు చేపట్టారు. చాలాకాలంగా పలమనేరు రోడ్డులో డ్రైనేజీని శుభ్రం చేయకపోవడంతో ఈ కాల్వ పూర్తిగా పూడిపోయింది. దీంతో సోమవారం ఈవో శివశంకర్ నేతృత్వంలో పంచాయతీ సిబ్బంది కాల్వను పూర్తిగా శుభ్రం చేశారు. అలాగే పట్టణ పరిధివాడలో పారిశుధ్య పనులు చేపట్టారు. తాగునీటి సమస్య ఉంటే తెలియజేస్తే సమస్య పరిష్కరిస్తామని సర్పంచ్ పీ.ఎస్.లక్ష్మీ తెలిపారు.

'పరీక్ష పే చర్చ'ను వీక్షించిన విద్యార్థులు



పలమనేరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): పలమనేరులోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో విద్యార్థులు ప్రధాని నరేంద్రమోదీ సోమవారం నిర్వహించిన 'పరీక్ష పే చర్చ' కార్యక్రమంలో పాల్గొన్నారు. పరీక్షల భయాన్ని పోగొట్టేందుకు చేపట్టిన ఈ కార్యమాన్ని అందరూ వీక్షించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని ఎంఈఓ లీలారాణి పరిశీలించారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ

కల్లూరు, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పులిచెర్ల గ్రంథాలయాధికారి అమర్‌నాథ్ తెలిపారు. పులిచెర్ల గ్రంథాలయానికి ఇంగ్లీషు నవలలు, విలువైన పుస్తకాలను సోమవారం సదుంకు చెందిన వారణాసి జయకుమార్‌రెడ్డి అందజేశారు. ఆ పుస్తకాలను పులిచెర్ల బీవీ రెడ్డి బంగళాలో పనిచేస్తున్న గోపి గ్రంథాలయాధికారికి అప్పగించారు.

కాశీ విశ్వేశ్వరస్వామి తిరుణాల ప్రారంభం

సదుం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సదుం మండలం పాలమంద పంచాయతీ జంగంవారిపల్లెలో వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామి తిరుణాల సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమైంది. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అన్నదానం చేశారు. 12న శివపార్వతుల కల్యాణోత్సవం, రథోత్సవం, బ్రహ్మోత్సవం, 13న వసంతోత్సవం, సాయంత్రం పార్వేట ఉత్సవం, రాత్రి పవళింపు సేవలు ఘనంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వివరించారు.

వరమనూరు వద్ద జల్లీ ఫ్యాక్టరీ వద్దు

కుప్పం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం కృష్ణదాసనపల్లె పంచాయతీ వరమనూరు వద్ద జల్లీ ఫ్యాక్టరీ వద్దని ఆ గ్రామంతోపాటు సమీప గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు వారు కుప్పం టీడీపీ కార్యాలయంలోని జన నాయకుడు గ్రీవెన్స్ సెల్‌లో అర్జీ సమర్పించారు. ఫ్యాక్టరీ మొదలైతే తమ పొలాలు, ఇళ్లు ధ్వంసమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ జల్లీ ఫ్యాక్టరీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చివుంటే వెంటనే రద్దు చేయాలని కోరారు.

నేడు సల్లాపురమ్మ జాతర

సోమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఎస్.వడ్డిపల్లెలో మంగళ వారం సల్లాపురమ్మ జాతర నిర్వహణకు ఆలయం వద్ద ఏర్పాట్లు చురుగ్గా చేపట్టారు. ఆలయం వద్ద పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. బుధవారం 24 గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి పిండి దీపాలు, జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించనున్నారు. అమ్మవారిని పల్లకీలో ఊరేగించి భక్తులకు దర్శనం కల్పించనున్నారు. భక్తుల రాత్రి జాగరణ కోసం పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): పుంగనూరు డివిజన్ పరిధిలో రెండు అంగన్వాడీ సహాయకుల పోస్టులకు అర్హత కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో రాజేశ్వరి కోరారు. సోమవారం ఆమె మాట్లాడుతూ పుంగనూరు పట్టణ పరిధిలోని రాంనగర్ కేంద్రంలోని పోస్టుకు బీసీ-డి అభ్యర్థులు, సోమల మండలం ముంత్రివారిపల్లెలోని కేంద్రానికి జనరల్ కేటగిరి అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. స్థానికులై, పదో తరగతి పాసై, వివాహమైన మహిళలు అర్హులని తెలియజేశారు. దరఖాస్తులను ఈ నెల 22 లోపు ఐసీడీఎస్ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

పలమనేరు: పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని గంగవరం మండలం తమ్మిరెడ్డిపల్లి, జీడిమాకులపల్లి అంగన్వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలి పోస్టులకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ ఇందిరాప్రియదర్శిని కోరారు.

కుప్పం: కుప్పం నియోజకవర్గం పరిధిలోని కుప్పం, గుడుపల్లె, శాంతిపురం, రామకుప్పం మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థులు దరకాస్తు చేసుకోవాలని సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. కుప్పం మండలం వేపూరు అంగన్‌వాడీ హెల్పర్ పోస్టుకు బీసీ(బి), గుడుపల్లె మండలం సంగనపల్లె అంగన్వాడీ హెల్పర్ పోస్టుకు జనరల్, శాంతిపురం మండలం కోటగడ్డ మినీ అంగన్వాడీ పోస్టుకు జనరల్, రామకుప్పం మండలం పంద్యాలమడుగు అంగన్వాడీ ఆయా పోస్టుకు ఎస్టీలు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

మైనారిటీ నాయకుడికి ఎమ్మెల్యే అమర్ పరామర్శ

పలమనేరు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి) : పలమనేరుకు చెందిన టీడీపీ మైనారిటీ నాయకుడు బావా జాన్‌ను సోమవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పరామర్శించారు. ఇటీవల బావాజాన్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పలమనేరు బాలాజి కోఆపరేటివ్ సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి. బాలాజీ, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ చాంద్‌బాషా, శీధర్ పాల్గొన్నారు.

ఎక్స్‌కవేటర్ సీజ్

పలమనేరు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): పలమనేరు మండలం కొలమాసనపల్లి పెద్దచెరువులో అక్రమంగా తవ్వకాలు జరుపుతున్న ఎక్స్‌కవేటర్‌ను తహసీల్దార్ ఇన్బనాథన్ సీజ్‌చేశారు. సీఐ నరసింహరాజుకు వచ్చిన సమాచారం మేరకు ఎక్స్‌కవేటర్‌ను సీజ్‌చేశారు.

మార్కెట్ షెడ్లను పరిశీలించిన ఎమ్మెల్యే పెద్దిరెడ్డి

సదుం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సదుం వారపు సంతలో నిర్మిస్తున్న షెడ్లను ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సోమవారం పరిశీలించారు. అసంపూర్తిగా మిగిలిన పనులను త్వరిత గతిన పూర్తి చేయాలని కాంట్రాక్టరుకు సూచించారు. ఆయన వెంట జడ్పీటీసీ సోమశేఖరరెడ్డి, జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు పెద్దిరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం తగ్గించాలి



గురుకుల పాఠశాల విద్యార్థినులకు నులిపురుగుల మాత్రలు అందజేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్ వినియోగం వీలైనంత మేర తగ్గించుకోవాలని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించారు. సోమవారం ఆయన పలమనేరు బాలికోన్నత పాఠశాల, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు అంధత్వనివారణ సంస్థ అందజేసిన కంటి అద్దాలను పంపిణీ చేశారు. అలాగే విద్యార్థినులకు నులిపురుగుల మాత్రలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యంగా ఉంటేనే చదువుపై శ్రద్ధపెట్టగలరని పేర్కొన్నారు. సెల్‌ఫోన్ వాడకం వలన కంటి చూపు దెబ్బతినే అవకాశాలు ఉన్నాయన్నారు. నులిపురుగుల మాత్రలు తీసుకోవడం వలన పలు ఆరోగ్య సమస్యలు తలెత్తవని పేర్కొన్నారు. సూపర్ బజార్ అధ్యక్షులు ఆర్.వి. బాలాజి, జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ అర్పిత, ఎంఈఓ బాలసుందరం, బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిణి లత, గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, పీఎంఎంఓ మధు, ఎంపీహెచ్ఓ జయశంకర్, టీడీపీ నాయకులు ఆర్బీసీకుట్టి, గిరిబాబు, సుబ్రమణ్యంగౌడు, నాగరాజు, ఖాజా, చాంద్‌బాషా, శ్రీధర్, కిరణ్, బీఆర్‌సి కుమార్, సుధాకర్, శంకరప్ప పాల్గొన్నారు.

వైభవంగా ఆలయాల కుంభాభిషేక మహోత్సవం



రామకుప్పం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): ఆరిమానిపెంట గ్రామంలోని మల్లికాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయంతో బాటూ ఆవరణలో ఉప ఆలయాల కుంభాభిషేక మహోత్సవాలు శనివారం నుంచి సోమవారం వరకు వైభవంగా జరిగాయి. సోమవారం తెల్లవారుజామున వేదపండితులు గణపతి పూజ, గోపూజ, స్వస్తివాచనం, కళశారాధన, దీక్షాహోమం, కళాన్యాస హోమాలు నిర్వహించారు. 4గంటలకు మల్లికాంబ సమేత మల్లేశ్వరస్వామి, మహాగణపతి, సుబ్రహ్మణ్యస్వామి, నాగదేవతలు, లక్ష్మీనరసింహస్వామి విగ్రహాలను ప్రతిష్ఠింపజేశారు. అనంతరం చతుషష్టి కళాన్యాసాలు, ప్రాణప్రతిష్ఠ, నేత్రోన్మీలము, కలశోద్వాసన, మహాకుంభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం మూలమూర్తులకు అర్చనలు, మాహామంగళహారతులు, గో, కన్య, దర్పణ, అగ్నిదర్శనాలు, బలి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి, దైవదర్శనాలు చేసుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశారు.

రక్తం పంచుకు పుట్టినా.. రోడ్డున పడేశారు

ఆపన్నుల కోసం ఎదురుచూస్తున్న వృద్ధురాలు



చౌడేపల్లె, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): ఆమె వయసు 70 సంవత్సరాలు. భర్త 20 ఏళ్ల క్రితం చనిపోయారు. పిల్లలు లేరు. తోడబుట్టిన సోదరుల ఇంట్లోనే ఉండేది. పనిచేయగలిగినంత కాలం కూలీనాలీ చేసి అంతో ఇంతో వారికే ఇచ్చింది. ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉంది. అయితే వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను చూసుకోలేమని ఆ సోదరులు ఆమెను పట్టించుకోలేదు. దీంతో ముదిమి వయసులో ఆమె రోడ్డున పడింది. నిలువ నీడలేక ఆపన్నుల కోసం ఎదురుచూస్తోంది. చౌడేపల్లె మండలంలోని ఏ.కొత్తకోటకు చెందిన బజంత్రి వెంకటరమణమ్మ(70) భర్త 20 ఏళ్ల క్రితం చనిపోయాడు. పిల్లలు లేకపోవడంతో ఆమె ఏ.కొత్తకోటలోనే ఉంటున్న తమ్ముళ్లు గురుస్వామి, వెంకటరమణ పంచనచేరింది. కూలీనాలీ చేస్తూ చేదోడు వాదోడుగా ఉండేది. వయస్సు మీద పడడంతో వ్యవసాయ పనులు చేయలేని పరిస్థితి. ఈ క్రమంలో ఆమెను పోషించలేక తమ్ముళ్లు రోడ్డున పడేశారు. దీంతో ఆమె గ్రామంలోనే రోడ్డుపై అనాథలా మారింది. తనకు ఆశ్రమం ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటోంది.

వైభవంగా వేణుగోపాలుడి కాశీ యాత్ర



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేదపండితులు

వి.కోట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోల స్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభంగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఐదోరోజు సోమవారం ఉదయం స్వామివారికి పలురకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు స్వామివారికి ఘనంగా కాశీ యాత్ర ఉత్సవం జరిపారు. సర్పంచ్ పీ.ఎస్.లక్ష్మీ కుటుంబీకులచే కల్యాణోత్సవం కనుల పండువగా జరిపించారు. భక్తులతో ఆలయం ప్రాంగణం కిటకిట లాడింది. రాత్రికి ఉత్సవమూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య, ఇతర కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

వైసీపీతో లాలూచీ వ్యవహారాలొద్దు: టీడీపీ



మాట్లాడుతున్న పీఎస్ఎం, ప్రేమ్‌కుమార్

కుప్పం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ వారితో లాలూచీ వ్యవహారాలు మానుకోవాలని, లేని పక్షంలో పార్టీపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా ఉండాలని టీడీపీ కుప్పం మండల సమావేశంలో నిర్ణయించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జన నాయకుడు వెబ్ పోర్టల్‌పై టీడీపీ కుప్పం మండల సమావేశం నిర్వహించారు. జన నాయకుడు ద్వారా అర్జీలు ఎలా సమర్పించాలి, గ్రామాలలోని సమస్యలు, ప్రజల వ్యక్తిగత సమస్యలపై వినతులు ఎలా ఇవ్వాలి, రశీదులు పొందే విధానం వంటి అన్ని అంశాలపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. కుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో కొందరు టీడీపీ నాయకులు వైసీపీ వారితో లాలూచీ పడి పజా వ్యతిరేకమైన కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి వ్యవహారాలను మానుకోవాలని విన్నవించారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ జన నాయకుడు పోర్టల్‌పై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి లబ్ధిదారులను పంచాయతీ సమన్వయ కమిటీలు ఎంపిక చేసి జాబితాను పార్టీ కార్యాలయానికి ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు.

బైపాస్ రోడ్ ఏర్పాటు చేయాలి



గౌనివారి శ్రీనివాసులుతో కలిసి కడా పీడీకి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

రామకుప్పం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం చెల్దిగానిపల్లె మీదుగా నిర్మితం కానున్న పలమనేరు-కుప్పం నాలుగు లేన్ల జాతీయ రహదారిని గ్రామం మీదుగా కాకుండా బైపాస్ రోడ్ నిర్మించాలని గ్రామస్తులు మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సోమవారం కడ పీడీ వికాస్ మర్మత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. గ్రామం మీదుగా రహదారి ఏర్పాటు చేస్తే 70 ఇళ్లు కూల్చివేతకు గురవుతాయని పీడీ ఎదుట వాపోయారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామస్తులకు ఇబ్బందుల్లేకుండా రోడ్డు నిర్మాణం జరిగేలా చూస్తానిని పీడీ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు సురేష్, సత్యనారాయణ, రెడ్డిపురుషోత్తం, ఉమాపతి, లక్ష్మీపతి, వెంకటాచలం, వెంకటేష్, చౌడప్ప, ఉదయ్, ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.

భూ సమస్యలు పరిష్కరిస్తాం

సోమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వివిధ సమస్యలపై రైతుల నుంచి వచ్చిన వినతులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సోమల తహసీల్దార్ బెన్నురాజ్ తెలిపారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజాసమస్యల పరిష్కార వేదికలో పలు భూ వివాదాలు సమస్యలపై వినతులు అందాయి. క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి న్యాయం చేస్తామన్నారు. రేషన్ దుకాణాల్లో కందిపప్పు సక్రమంగా పంపిణీ జరగడం లేదని ఆరోపణలు వస్తున్నాయని విచారణ చేసి డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్వోలు రేషన్ దుకాణాలను తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని ఆదేశించారు.

ప్రత్యేక అలంకరణలో బోయకొండ గంగమ్మ

పుంగనూరు రూరల్, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాగానిపల్లె పంచాయతీ దండుపాళ్యంలో బోయకొండ గంగమ్మ ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. రెండు రోజులుగా నూతనంగా నిర్మించిన బోయకొండ గంగమ్మ ఆలయంలో హోమాలు నిర్వహించి గంగమ్మ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు అధికసంఖ్యలో అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, శివకుమార్‌రెడ్డి, నరేంద్రరెడ్డి, విరూపాక్షి పాల్గొన్నారు.

నేడు టీడీపీ సమావేశం

రామకుప్పం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): టీడీపీ రామకుప్పం మండల సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనంద రెడ్డి, నరసింహులు తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక వళ్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద జరిగే ఈ సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ తదితరులు పాల్గొంటారని వివ రించారు. జననాయకుడు పోర్టల్‌తో పాటు కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కార్యాచరణ ప్రణాళిక రూపకల్పనపై దిశానిర్దేశం చేయనున్నారని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని కోరారు.

రైతు కార్డు కోసం నమోదు చేసుకోవాలి

పలమనేరు, ఫిబ్రవరి10(ఆంధ్రజ్యోతి) : పలమనేరు మండలంలోని రైతులందరూ తప్పనిసరిగా డిజిటల్ గుర్తింపు కార్డుకోసం నమోదు చేసుకోవాలని ఏవో సంధ్య కోరారు. రైతులు రైతు సేవాకేంద్రం వద్దకు వెళ్లి ఆధార్, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్‌నంబరు ఇతర వివరాలు అందించాలని పేర్కొన్నారు. ఈ గుర్తింపు కార్డు ఉంటేనే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తిస్తాయని వివరించారు.

చౌడేపల్లె: రైతులు ప్రత్యేక విశిష్ట గుర్తింపు కార్డు కోసం ఈ నెల 28లోపు నమోదు చేసుకోవాలని ఏవో జ్యోతి పేర్కొన్నారు. సోమవారం ఆమె మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా రైతులకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు కార్డును ఇవ్వనున్నట్లు తెలిపారు. రైతులు తమ ఆధార్, 1బి, ఆధార్ లింక్ ఫోన్ నంబరుతో రైతు సేవా కేంద్రాలలో సంప్రదించాలని కోరారు.

అండగా ఉంటాం: టీడీపీ

కుప్పం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం అవులనత్తం గ్రామం సమీపంలోని జల్లీ ఫ్యాక్టరీని మూసివేయాలని కొన్ని రోజులుగా ధర్నా చేస్తున్న గ్రామస్తులకు అండగా ఉంటామని టీడీపీ కుప్పం మండల అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ హామీ ఇచ్చారు. దీక్షా శిబిరాన్ని ఆయన సోమవారం సందర్శించి బాధితులతో మాట్లాడారు. సమస్యను ప్రభుత్వంతోపాటు పార్టీ అధిష్ఠానం దృష్టికి కూడా తీసుకుని వెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



కుప్పంలో విద్యార్థులకు మాత్రలు మింగిస్తున్న డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో గంగాదేవి

కుప్పం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): నులిపురుగుల నిర్మూలన పట్ల ప్రతి విద్యార్థి అవగాహన కల్గి ఉండాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో గంగాదేవి అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగు నిర్మూలనా దినోత్సవం సందర్భంగా కుప్పం బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను మిం గించారు. ఈ కార్యక్రమంలో కుప్పం యూపీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ దీప్‌కుమార్, డాక్టర్ సాయి హిమంత్, ఎంపీహెచ్‌ఈవో ఇస్మాయిల్, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమల: స్థానిక జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధరం నాయుడు ఆధ్వర్యంలో కళాశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. అలాగే సోమల హైస్కూల్, కందూరు, పెద్దఉప్పరపల్లెలో విద్యార్థులకు డాక్టర్ బాలాజీ, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ జయసింహ, వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు.

రొంపిచెర్ల: రొంపిచెర్ల మండలంలో 4061 మంది పిల్లలకు గాను 3988 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు వైద్యాధికారి డాక్టర్ దినేష్ కుమార్ తెలిపారు.

కల్లూరు: పులిచెర్ల మండలం ఎల్లంకివారిపల్లి పీహెచ్‌సీ పరిధిలోని ఉన్నత పాఠశాలలో సోమవారం నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీచేశారు. డాక్టర్ యల్లయ్య హెచ్ఎం హరిశంకర్ పాల్గొన్నారు.

చౌడేపల్లె: స్థానిక జూనియర్ కళాశాలలో ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మండలంలోని లద్దిగం పీహెచ్‌సీ పరిధిలో 10037 మందికి గాను 9808 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. జూనియర్ కళాశాల ప్రిన్స్‌పాల్ జయప్రకాష్ పాల్గొన్నారు.

పుంగనూరు: శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ ప్రిన్సిపాల్ రాజశేఖర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల మాత్రలను పంపిణీ చేశారు.

పలమనేరు: పలమనేరు మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పలమనేరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఎంఈఓ లీలారాణి నులిపురుగుల మాత్రలు మింగించారు. హెచ్ఎం షంషీర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లె: కడపనత్తం జడ్పీఉన్నత పాఠశాల, కమ్మనపల్లె కస్తూరిబా పాఠశాల, తీర్థం జడ్పీఉన్నత పాఠశాలలో విద్యా ర్థులకు బైరెడ్డిపల్లె, తీర్థం పీహెచ్‌సీ వైద్యాధికారులు విజయ చందర్, అరుణ్‌కుమార్ మాత్రలు పంపిణీచేశారు. ఎంపీడీవో రాజేంద్రబాలాజీ, ఆరోగ్యవిద్యాధికారులు సావిత్రి, కాంతమ్మ పాల్గొన్నారు.

అన్నామలైయార్ స్వామి సేవలో భానుప్రకాష్



కుంభాభిషేకంలో పాల్గొన్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోని కేవీపీఆర్‌పేటలో సోమవారం జరిగిన అరుళ్మార్ ఉన్నములై అమ్మన్ సమేత అరుళ్మిగు అన్నామలైయార్ స్వామి ఆలయ కుంభాభిషేకానికి నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరయ్యారు. ఆయనకు నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. గ్రామస్థులు, పట్టణ కార్యదర్శి శ్రీనివాసన్ పాల్గొన్నారు.

డ్రిప్ పరికరాలపై రాయితీని సద్వినియోగం చేసుకోండి



పొలంలో అమర్చిన డ్రిప్‌ను పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ ఓఎస్డీ రమేష్

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రైతులకు రాయితీపై ప్రభుత్వంపై అందిస్తున్న డ్రిప్ పరికరాలను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఎంఐపీ ఓఎస్డీ రమేష్ సూచించారు. సోమవారం చిత్తూరు మండలంలోని తిమ్మసానపల్లెలోని రైతు తన పొలంలో అమర్చిన డ్రిప్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుమారు 70 నుంచి 90 శాతం వరకు రాయితీ ఇస్తోందన్నారు. ఏపీఎంఐపీ పీడీ బాల సుబ్రహ్మణ్యం, అధికారులు నరేష్, శివారెడ్డి పాల్గొన్నారు.

పెనుమూరు సీహెచ్‌సీలో ఎక్స్‌రే ఉందని తెలుసా?

పెనుమూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పెనుమూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ)లో ఎక్స్‌రే సదుపాయం ఉందని చాలామందికి తెలియదు. 50 పడకల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ అయ్యాక అధునాతన వైద్య సదుపాయాలు ఇక్కడ రోగులకు అందుబాటులోకి వచ్చాయి. ఇందులో భాగంగానే గత ఏడాది డిసెంబరు నుంచి ఎక్స్‌రే ఉన్నా మండల ప్రజలకు పెద్దగా తెలియదు. గత వారంలో డీసీహెచ్‌ఎస్ ప్రభావతి ఆస్పత్రిని తనిఖీ చేయగా ఎక్స్‌రేలు తీయటం లేదని గుర్తించారు.

బత్తిరెడ్డికుంట ఆక్రమణను పట్టించుకోరా? / రైతుల ఆవేదన



ఆక్రమణదారుడు సాగు చేస్తున్న బత్తిరెడ్డికుంట భూమి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): బాలుపల్లె సమీపంలో ఉన్న బత్తిరెడ్డికుంట ఆక్రమణను ఎవ్వరూ పట్టించుకోరా? అని స్థానిక రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుంటను వైసీపీ సానుభూతిపరుడు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని వెదురుకుప్పం తహసీల్దార్ కార్యాలయంలో రాతపూర్వకంగా ఫిర్యాదులు ఇచ్చినా ఫలితం లేకపోయిందని ఆరోపించారు. పెరుమాళ్లపల్లె రెవెన్యూ లెక్కదాఖల్లో సర్వే నెంబరు 84/5లో 2.36 ఎకరాల్లో ఈ కుంట ఉందన్నారు. ఆక్రమణకు గురవడంతో అక్కడ కుంట రూపురేఖలు మారిపోయిందని తెలిపారు. జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చిన్నారుల్లో వైకల్యాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించాలి

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి భారతి



సంతగేటులో చిన్నారి ఆరోగ్య స్థితిని తెలుసుకుంటున్న భారతి, సిబ్బంది

యాదమరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు కలిగే అంగవైకల్యాన్ని ప్రాథమిక దశలోనే గుర్తించి నివారణకు కృషిచేయాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి భారతి సూచించారు. సంతగేటు గ్రామంలో డోర్ టు డోర్ క్యాంపెయిన్ ప్రోగ్రాంను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక పీహెచ్‌సీని సందర్శించి వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం వైద్యులు, సిబ్బందితో కలిసి గ్రామంలో పర్యటించి చిన్నారుల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. ఆర్బీఎస్‌కే కోఆర్డినేటర్ డాక్టర్ శిరీష, సంతగేటు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సురేఖ, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, హెడ్ కానిస్టేబుల్ కృష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించండి: కమిషనర్



బాధితురాలి అర్జీ పరిశీలిస్తున్న కమిషనర్ నరసింహ ప్రసాద్

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించాలని నగర పాలక కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కార్యాలయ ఆవరణలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని నిర్వహించారు. బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇంజనీరింగ్‌కు 3, పబ్లిక్‌హెల్త్‌కు 2, రెవెన్యూకు 2, పించన్లకు 2 చొప్పున మొత్తం తొమ్మిది అర్జీలు అందాయి. గతవారం వచ్చిన అర్జీలపైనా అధికారులతో సమీక్షించారు. ఎంఈ వెంకట్రామిరెడ్డి, ఎంహెచ్‌వో లోకేష్, ఏసీపీ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఈ రోడ్డు బాగు పడేదెప్పుడు..?

వెదురుకుప్పం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం నాగిరెడ్డిపల్లె నుంచి డీఎంపురంకు వరకు ఉన్న మూడు కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా ఉంది. దీనిపై అధికారులకు స్థానికులు వినతిపత్రాలిచ్చినా ప్రయోజనం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాళ్ల రప్పలతో నిండిన ఈ రోడ్డును ఇప్పటికైనా బాగు చేయాలని విజ్ఞప్తి చేశారు.



నాగిరెడ్డిపల్లె నుంచి డీఎంపురానికి వెళ్లే రోడ్డు దుస్థితి





శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లు, పరిసరాల్లో ముళ్ల కంపలు

సమస్యలతో కాపురం

వానొస్తే ఉరుస్తున్న ఇళ్లు - కాలువలు లేవు - మట్టి రోడ్డుతో అవస్థలు

జగన్నాథపురం ఎస్టీ కాలనీలో ఇదీ పరిస్థితి

వెదురుకుప్పం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలం ఎల్ఆర్‌పేట గ్రామ పంచాయతీలోని జగనాథపురం ఎస్టీ కాలనీలో స్థానికులు సమస్యలతో కాపురం చేస్తున్నారు. ఇక్కడ 50 వరకు ఇందిరమ్మ ఇళ్లు ఉన్నాయి. ఎన్నో ఏళ్ల కిందట నిర్మించినవి కావడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. 35 ఇళ్ల వరకు వానొస్తే ఉరుస్తున్నాయి. మురుగు కాలువలు లేవు. పరిసరాలన్నీ ముళ్ల కంపలు, చెత్తచెదారంతో నిండిపోయాయి. ప్రాథమిక పాఠశాల ఉన్నా మౌలిక వసతులు లేవు. కేవలం 12మంది విద్యార్థులు చదువుకుంటున్నారు.

మట్టి రోడ్డూ అధ్వానమే

కాలనీకి వచ్చే మట్టి రోడ్డూ అధ్వానంగా ఉంది. దీనివల్ల బస్సు సదుపాయం లేదు. గోపిశెట్టిపల్లె క్రాస్ రోడ్డు నుంచి సుమారు ఆరు కిలోమీటర్ల దూరంలో కాలనీ ఉంది. ఈ మార్గంలోని రోడ్డంతా కోతలు, గుంతలతో నిండిపోయింది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. తారు రోడ్డు వేయించాలని స్థానికులు కోరుతున్నా పట్టించుకునే వారు కరువయ్యారు. అధికారులు, ప్రజాప్రతినిధులు ఎవరూ తమ కాలనీ వైపు కన్నెత్తి చూడటం లేదని వాపోతున్నారు.





గోపిశెట్టిపల్లె క్రాస్ రోడ్డు నుంచి జగన్నాథపురానికి వెళ్లే రోడ్డు దుస్థితి

కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తమ సమస్యలు పరిష్కారమవుతాయని స్థానికులు ఆశలు పెట్టుకున్నారు. తారు రోడ్డు వేయించి, సాగు చేసుకోవడానికి భూములిచ్చి ఆదుకోవాలని కోరుతున్నారు.

తారు రోడ్డు వేస్తే సగం సమస్యలు తీరినట్లే



గోపిశెట్టిపల్లె క్రాస్ రోడ్డు నుంచి తమ గ్రామానికి తారు రోడ్డు వేస్తే సగం సమస్యలు తీరినట్లే. చాలా సార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు.

- గిరి, స్థానికుడు

ఇళ్లు ఉరుస్తున్నాయి



50 కుటుంబాల వారం ఉంటున్నాం. 35 ఇళ్లు వానొస్తే ఉరుస్తున్నాయి. కాలనీలో మౌలిక వసతులు లేవు. మా సమస్యలు ఎవరికి చెప్పినా పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు, ఎమ్మెల్యే అయినా మా సమస్యలు పరిష్కరించాలి.

-పద్మ, స్థానికురాలు

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి

నగరి, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ ఆకాంక్షించారు. కొత్తపేట ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష తరగతి గదిని ప్రారంభించారు.అలాగే గాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్‌బాబు, నాయకులు గుణశేఖర్, వీకేఎస్ వాసు, ఆర్ముగం, కమిషనర్ కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చాలి

విద్యార్థులు తలిదండ్రుల ఆశయాన్ని నెరవేర్చాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. పీసీఎన్ జూనియర్ కళాశాల వార్షికోత్సవంలో ఆయన ప్రసంగించారు. అధ్యాపకులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా వేణుగోపాలుడి కాశీ యాత్ర

వి.కోట, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రుక్మిణీ, సత్యభామా సమేత వేణుగోల స్వామి వారి ఆలయ బ్రహ్మోత్సవాలు అత్యంత వైభంగా జరుగుతున్నాయి. ఉత్సవాల ఐదోరోజు సోమ వారం ఉదయం స్వామివారికి పలురకాల అభిషే కాలు, పూజలు నిర్వహించారు. విశ్వబ్రాహ్మణ సంఘం నేతలు స్వామివారికి ఘనంగా కాశీ యాత్ర ఉత్సవం జరిపారు. సర్పంచ్ పీ.ఎన్.లక్ష్మీ కుటుంబీకులచే కల్యాణోత్సవం కనుల పండువగా జరిపించారు. భక్తులతో ఆలయం ప్రాంగణం కిటకిట లాడింది. రాత్రికి ఉత్సవ మూర్తులను గరుడ వాహనంపై కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ధర్మకర్త సీతారామయ్య, ఇతర కమిటీ సభ్యులు భక్తులకు తీర్థ, ప్రసాదాలను పంపిణీ చేశారు.

రక్తం పంచుకు పుట్టినా.. రోడ్డున పడేశారు

ఆపన్నుల కోసం ఎదురుచూస్తున్న వృద్ధురాలు



చౌడేపల్లె, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): ఆమె వయసు 70 సంవత్సరాలు. భర్త 20 ఏళ్ల క్రితం చనిపోయారు. పిల్లలు లేరు. తోడబుట్టిన సోదరుల ఇంట్లోనే ఉండేది. పనిచేయగలిగినంత కాలం కూలీనాలీ చేసి అంతో ఇంతో వారికే ఇచ్చింది. ప్రస్తుతం వృద్ధాప్యంలో ఉంది. అయితే వృద్ధాప్య సమస్యలతో బాధపడుతున్న ఆమెను చూసుకోలేమని ఆ సోదరులు ఆమెను పట్టించుకోలేదు. దీంతో ముదిమి వయసులో ఆమె రోడ్డున పడింది. నిలువ నీడలేక ఆపన్నుల కోసం ఎదురుచూస్తోంది. చౌడేపల్లె మండలంలోని ఏ.కొత్తకోటకు చెందిన బజంత్రి వెంకటరమణమ్మ(70) భర్త 20 ఏళ్ల క్రితం చనిపోయాడు. పిల్లలు లేకపోవడంతో ఆమె ఏ.కొత్తకోటలోనే ఉంటున్న తమ్ముళ్లు గురుస్వామి, వెంకటరమణ పంచనచేరింది. కూలీనాలీ చేస్తూ చేదోడు వాదోడుగా ఉండేది. వయస్సు మీద పడడంతో వ్యవసాయ పనులు చేయలేని పరిస్థితి. ఈ క్రమంలో ఆమెను పోషించలేక తమ్ముళ్లు రోడ్డున పడేశారు. దీంతో ఆమె గ్రామంలోనే రోడ్డుపై అనాథలా మారింది. తనకు ఆశ్రమం ఇచ్చి ఆదుకోవాలని వేడుకుంటోంది.

రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే చర్యలు



చౌకదుకాణంలో తనిఖీలు చేస్తున్న శంకర్

శ్రీరంగరాజపురం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి శంకర్ హెచ్చరించారు. సోమవారం 49.కొత్తపల్లెలో చౌకదుకాణాన్ని తనిఖీ చేశారు. ఆర్ఐ ప్రభాకర్, వీఆర్ఏలు కనకరాజులు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

కాశీ విశ్వేశ్వరస్వామి తిరునాళ్ల ప్రారంభం

సదుం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): సదుం మండలం పాలమంద పంచా యతీ జంగంవారిపల్లెలో వెలసిన కాశీ విశ్వేశ్వరస్వామి తిరునాళ్ల సోమవారం ధ్వజారోహణంతో ప్రారంభమైంది. 12న శివపార్వతుల కల్యాణోత్సవం, రథోత్సవం, బ్రహ్మోత్స వం, 13న వసంతోత్సవం, సాయంత్రం పార్వేట ఉత్సవం, రాత్రి పవళింపు సేవలు జరగనున్నాయి.

'ఆల్బెండజోల్'తో నులిపురుగుల నిర్మూలన



విద్యార్థినులతో మాత్రలు మింగిస్తున్న భారతి తదితరులు

చిత్తూరు రూరల్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): ఆల్బెండజోల్ మాత్రతో పిల్లల్లో నులిపురుగులను నిర్మూలించవచ్చని లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ భారతి అన్నారు. సోమవారం జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం సందర్భంగా పీసీఆర్ పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఆర్‌బీఎస్‌కే కోఆర్డినేటర్ శిరీష, కమిషనర్ నరసింహప్రసాద్, ఎంహెచ్‌వో డాక్టర్ లోకేష్ పాల్గొన్నారు. అలాగే పలు మండలాల్లోని అంగన్వాడీలు, పాఠశాలల్లో చిన్నారులతో ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు.

పెనుమూరు: కలిగిరి, కలవగుంట అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. ఎంపీడీవో నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఈవో పీఆర్డీ మహేశ్వర్‌రెడ్డి, సెక్రటరీలు పాల్గొన్నారు.

శ్రీరంగరాజపురం: ఆరిమాకులపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో మోహన మురళి, తహసీల్దార్ లోకనాథం పిళ్ళై, ఎంఈవో సబర్మతి, డాక్టర్ బాలసుబ్రమణ్యంరెడ్డి, డాక్టర్ గౌరి తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం: రంగాపురం అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణమహేష్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ మోహన్‌కృష్ణ, ఎంఈవో రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పం: జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ప్రవీణ, ఎంపీడీవో అమరనాథ్, ఎంఈవో దామోదరం,మహేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. ● కార్వేటినగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ బాలసుబ్రహ్మణ్యం ఆచారి, ఎన్ఎస్ఎస్ పీవో డాక్టర్ ధనంజయరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తవణంపల్లె: అరగొండ బాలుర ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో మండల వైద్యాధికారి ప్రియాంక, తహసీల్దార్ సుధాకర్, ఎంపీడీవో రెడ్డిబాబు,చ ఎంఈవోలు హేమలత, త్యాగరాజులురెడ్డి పాల్గొన్నారు.

గుడిపాల: నరహరిపేట జడ్పీ హైస్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారులు సంధ్య, చంద్ర మహేష్, హెచ్‌ఎం ఖాతుంబీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నింద్ర: ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో వైద్యులు వినీషా తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీవో శివప్రసాద్ వర్మ, హెచ్‌ఎం శివయ్య తదితరులు పాల్గొన్నారు.

యాదమరి: ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వేణు, ఎంఈవోలు రుక్మిణి, ప్రసాద్, వైద్యాధికారి డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, సీహెచ్‌వో లక్ష్మీనారాయణ, ప్రధానోపాధ్యాయుడు గిరిరాజ, ఇన్‌చార్జి ఈవోఆర్డీ సుకుమార్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వరమనూరు వద్ద జల్లీ ఫ్యాక్టరీ వద్దు

కుప్పం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం కృష్ణదాసనపల్లె పంచాయతీ వరమనూరు వద్ద జల్లీ ఫ్యాక్టరీ వద్దని ఆ గ్రామంతోపాటు సమీప గ్రామాల ప్రజలు కోరారు. ఈ మేరకు వారు కుప్పం టీడీపీ కార్యాలయంలోని జన నాయకుడు గ్రీవెన్స్ సెల్‌లో అర్జీ సమర్పించారు. ఫ్యాక్టరీ మొదలైతే తమ పొలాలు, ఇళ్లు ధ్వంసమవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవేళ జల్లీ ఫ్యాక్టరీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చివుంటే వెంటనే రద్దు చేయాలని కోరారు.

నేడు సల్లాపురమ్మ జాతర

సోమల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం ఎస్.వడ్డిపల్లెలో మంగళవారం సల్లాపురమ్మ జాతర నిర్వహణకు ఆలయం వద్ద ఏర్పాట్లు చురుగ్గా చేపట్టారు. ఆలయం వద్ద పచ్చని తోరణాలు, విద్యుత్ దీపాలంకరణలు చేపట్టారు. బుధవారం 24 గ్రామాలకు చెందిన భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి పిండి దీపాలు, జ్యోతులతో ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సమర్పించనున్నారు. అమ్మవారిని పల్లకీలో ఊరేగించనున్నారు. భక్తుల రాత్రి జాగరణకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తారు.

సంక్షిప్తంగా..

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

వెదురుకుప్పం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు చేసుకోవాలని సీడీపీవో పద్మసునంద తెలిపారు. వర్కర్ల పోస్టులకు కార్వేటినగరంలోని పెద్దహరిజనవాడ(ఎస్సీ), వెదురుకుప్పం మండలంలోని చిన్నపోడుజేను(ఎస్సీ), హెల్పర్లకు కార్వేటినగరంలోని ఆర్కేవీబీ పేట (ఓసీ), ఎస్ఆర్‌పురంలోని సీకేపురం(బీసీ-బీ)కు ఈనెల 22వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

గంగాధరనెల్లూరు: తిరువీధికుప్పం (ఓసీ), కోటాగరం (ఎస్సీ), కలిజవేడు (ఓసీ)లోని హెల్పర్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీవో గుండ్లపల్లె వినతశ్రీ కోరారు.

పీఎం ప్రసంగాన్ని వీక్షించిన విద్యార్థులు

గంగాధరనెల్లూరు, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): పరీక్షా పే చర్చ కార్యక్రమం సందర్భంగా తూగుండ్రం హైస్కూల్‌లో సోమవారం టీవీల ద్వారా పీఎం ప్రసంగాన్ని విద్యార్థులతో కలిసి అధికారులు, బీజేపీనేతలు, వీక్షించారు. ఎంఈవో2 గుణశేఖర్‌రెడ్డి, హైస్కూల్ విద్యాకమిటీ చైర్మన్ కాణిపాకం సుధాకర్‌శెట్టి, హెచ్‌ఎం రాజేంద్రనాయుడు, బీజేపీ జిల్లా నేత చిట్టిబాబు, మండల అధ్యక్షుడు ఆనంద్‌బాబు, ఎస్సీమోర్చా జిల్లా కార్యదర్శి సుందరరాజు తదితరులు పాల్గొన్నారు.

భూ కబ్జాలపై ఫిర్యాదు

గుడిపాల, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో భూకబ్జాలు జరుగుతున్నాయని పలువురు ఇన్‌చార్జి తహసీల్దార్ జయంతికి ఫిర్యాదు చేశారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో బాధితుల నుంచి అర్జీలను స్వీకరించారు.

రైతులంతా విశిష్ట గుర్తింపుకార్డు తీసుకోండి

గంగాధరనెల్లూరు/యాదమరి, ఫిబ్రవరి10 (ఆంధ్రజ్యోతి): విశిష్ట గుర్తింపుకార్డులు రైతులందరూ గంగాధర నెల్లూరు, యాదమరి మండలాల వ్యవసాయాధికారులు భవాని, చరిత సూచించారు. ఈనెలాఖరులోపు ప్రతి ఒక్కరూ రైతు సేవా కేంద్రాలకెళ్లి గుర్తింపు కార్డు తీసుకోవాలన్నారు. ఈ కార్డు ఉంటేనే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు.

క్రైం కార్నర్

యువతి అదృశ్యం

చిత్తూరు అర్బన్, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): నగరంలో సోమవారం ఓ యువతి అదృశ్యమైంది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. గిరింపేట బాలాజీ కాలనీకి చెందిన యాస్మిన్(27)కు బుధవారం వివాహం జరగాల్సి ఉంది. ఈ నేపథ్యంలో పెళ్లి పనుల్లో తల్లిదండ్రులు, బంధువులు బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో యాస్మిన్ కనిపించకుండా పోయింది. బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడ్డ రిగ్గుబండి

ఒకరికి తీవ్రగాయాలు

బంగారుపాళ్యం, ఫిబ్రవరి 10(ఆంధ్రజ్యోతి): రిగ్గుబండి అదుపు తప్పి బావిలో పడ్డ సంఘటన సోమవారం రాత్రి తంబుగానిపల్లె డాబా సమీపంలోని గుంటికాడిబావి వద్ద జరిగింది. ఈ ప్రమాదంలో ఎర్రాండ్లపల్లెకు చెందిన లక్ష్మీపతి నాయుడు(39) తీవ్రంగా గాయపడ్డారు. బాధితుడిని 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం చీలాపల్లె సీఎంసీ ఆస్పత్రికి తరలించారు.

వైసీపీతో లాలూచీ వ్యవహారాలొద్దు: టీడీపీ



మాట్లాడుతున్న పీఎస్ఎం, ప్రేమ్‌కుమార్

కుప్పం, ఫిబ్రవరి 10 (ఆంధ్రజ్యోతి): వైసీపీ వారితో లాలూచీ వ్యవహారాలు మానుకోవాలని, లేని పక్షంలో పార్టీపరమైన క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా ఉండాలని టీడీపీ కుప్పం మండల సమావేశంలో నిర్ణయించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం జన నాయకుడు వెబ్ పోర్టల్‌పై టీడీపీ కుప్పం మండల సమావేశం నిర్వహించారు. జన నాయకుడు ద్వారా అర్జీలు ఎలా సమర్పించాలి, గ్రామాలలోని సమస్యలు, ప్రజల వ్యక్తిగత సమస్యలపై వినతులు ఎలా ఇవ్వాలి, రశీదులు పొందే విధానం వంటి అన్ని అంశాలపై పార్టీ శ్రేణులకు అవగాహన కల్పించారు. కుప్పం మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ మండలంలో కొందరు టీడీపీ నాయకులు వైసీపీ వారితో లాలూచీ పడి పజా వ్యతిరేకమైన కార్యకలా పాలకు పాల్పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఇటువంటి వ్యవహారాలను మానుకోవాలని విన్నవించారు. ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం మాట్లాడుతూ జన నాయకుడు పోర్టల్‌పై ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేసి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ రుణాలకు సంబంధించి లబ్ధిదారులను పంచాయతీ సమన్వయ కమిటీలు ఎంపిక చేసి జాబితాను పార్టీ కార్యాలయానికి ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించారు.